


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




**ప్రజాస్వామ్యం ముసుగులో రాజకీయ రణరంగం!**

**- నాటి వైసీపీ పాలనలో అరాచకాలు ప్రజలు మరువరు**

**- వ్యవస్థలపై నమ్మకం మాటల్లో కాదు..చేతల్లో కనిపించాలి!**

3

# తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందాం

- ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు
- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఎప్పటికప్పుడు ప్రజలకు హెచ్చరిక సందేశాలు
- జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- ముందస్తు సన్నద్ధతపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2





అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ముందస్తు సన్నద్ధతపై సీఎం చంద్రబాబు ఆదివారం అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పా టు చేయాలని సూచించారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకూడదు... ఆస్తినష్టం సాధ్యమైనంత తగ్గించాలని ఆదేశించారు. ప్రజల ఫోన్లకు నిరంతరం సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాలని, తీర ప్రాంతాల్లో గ్రామాల ప్రజలను సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ పూర్తి సన్నద్ధతతో ఉండి విద్యుత్ పునరుద్ధరణ వేగంగా జరిగేలా చూడాలి..సముద్రంపై వేటకు వెళ్లిన అన్ని బోట్లు తీరానికి వచ్చేలా చూడాలి.. జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా అన్ని స్థాయిలలో ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# దూసుకొస్తున్న అర్నబ్ తుఫాన్

***28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం - ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాలకు హెచ్చరికలు జారీ***

***రేపటి నుంచి రెండురోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు***



విశాఖపట్నం(చైతన్యరథం): బంగాళాఖాతంలో కొనసాగుతు న్న తీవ్ర వాయుగుండం సోమవారం తూర్పు, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుఫాన్‌గా మారే అవకాశముందని తుఫాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు. ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉద యానికి అతి తీవ్ర తుఫాన్‌గా రూపాంతరం చెంది అదేరోజు మధ్యాహ్ననికి బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశ ముందని తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 140 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ఈ తుఫాన్‌కు బంగ్లాదేశ్ సూచించిన 'అర్నబ్' పేరు పెట్టిన విష యం తెలిసిందే. తుఫాన్ దృష్ట్యా ఈ నెల 27న ఏపీలోని కాకినాడ, కోనసీమ, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, గుంటూ రు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారు. కడప, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. 28వ తేదీన కూడా పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో హెచ్చరి కలు జారీ అయ్యాయి.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల తుదిజాబితా

**50,815 నామినేషన్లు చెల్లుబాటు**



అమరావతి (చైతన్యరథం): జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అర్హుల జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఆది వారం విడుదల చేశారు. ఈ జాబితాలో 50,815 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు ప్రకటించారు. ఎంపీటీసీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ-19,760, వైసీపీ-17,726, జనసేన-4,330, బీజేపీ -1,049 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయని తెలిపారు. జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ -1,693, వైసీపీ -1,445, జనసేన -587, కాంగ్రెస్ -316, బీజేపీ -227 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# రక్షణ రంగంలో మరో భారీ పెట్టుబడి

- శ్రీ సత్యసాయి జిల్లాలో
- రూ.2,500 కోట్లతో బెల్ ప్రాజెక్టు
- ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ వెల్లడి









అమరావతి(చైతన్యరథం): ఏపీలో రక్షణ రంగ తయారీకి సంబంధించిన పరిశ్రమల అభివృద్ధికి కీలక ముందడుగు పడు తోందని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'కేంద్ర ప్రభుత్వ రంగంలోని నవరత్న కంపెనీ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి రక్షణ రంగానికి సంబంధించిన వ్యవస్థను (డిఫెన్స్ ఎకోసిస్టమ్) నిర్మించడానికి శ్రీసత్యసాయి జిల్లాలో 914 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,500 కోట్ల పెట్టుబడి పెడుతోంది. దీనివల్ల మన యువతకు హై-టెక్ డిఫెన్స్ తయారీ రంగాలు, 800 ఉద్యోగాలు లభించడంతో పాటు రాయలసీమలో సరఫరాదారుల వ్యవస్థ కూడా పెరుగుతుంది. మనం చెప్పాం, చేసి చూపించాం అని పేర్కొన్నారు. కాగా 914 ఎకరాల స్థలంలో పాలసముద్రం సమీపంలో నిర్మించే ఈ యూనిట్‌లో క్షిపణులు, రాడార్ పరీక్షా పరికరాలు తయారవుతాయి. బెల్ 1956లో ప్రారంభమై ఇప్పుడు దేశ రక్షణ అవసరాల కోసం 350 ఉత్ప త్తులపై పనిచేస్తోంది. ఆకాశ్ క్షిపణి వ్యవస్థల తయారీ కూడా ఈ సంస్థ చేతిలోనే ఉంది. ఈ ప్రాజెక్టు వల్ల స్థానిక ఎంఎస్ఎంఈలకు కొత్త అవకాశాలు, ఒక పరిశ్రమ చుట్టూ మరో పది పరిశ్రమలు ఎదిగే అవకాశం ఉంది. శ్రీ సత్యసాయి జిల్లా ఇప్పుడు రక్షణ రంగ కేంద్రంగా మారుతోంది. పుట్టపర్తిలో డీఆర్‌డీవో విమాన సమీకృత, ఫ్లైట్ టెస్టింగ్ కాంప్లెక్స్‌కు సుమారు 350 ఎకరాలు కేటాయిం చారు. ఇది అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్యక్ర మానికి ఉద్దేశించింది. మరోవైపు మడకశిరలో మరికొన్ని రక్షణ తయారీ సంస్థలు అడుగుపెడుతున్నాయి. రాయలసీమ ఇక వెనుక బడిన ప్రాంతం కాదు..భారత రక్షణ పటంలో మెరిసే నక్షత్రం.

# జడ్పీ పీఠాలపై కసరత్తు

**సీఎం చంద్రబాబుతో కూటమి నేతల భేటీ**

అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి పక్షాల సర్దుబాటు చర్చలు కొనసాగుతున్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు కసరత్తు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత జనసేన, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల సర్దుబాటు బాధ్యతను స్థానిక నేతలకు రాష్ట్ర నాయకులు అప్పగించారు. జడ్పీ చైర్మన్ స్థానాలపై రాష్ట్రస్థాయిలో సర్దుబాటు చర్చలు జరుగుతున్నాయి. మొత్తం 28 జడ్పీ చైర్మన్, 659 జడ్పీటీసీ స్థానాలపై కూటమి కసరత్తు చేస్తోంది. 660 ఎంపీపీ, 9,829 ఎంపీటీసీ స్థానాలపై అవగాహన కుదరాల్సి ఉంది. ఆదివారం రాత్రికి కూటమి పక్షాలు పోటీ చేసే జాబితాపై ఉమ్మడిగా ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి.

# తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందాం

- ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు
- అన్ని శాఖలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- ఎప్పటికప్పుడు ప్రజలకు హెచ్చరిక సందేశాలు పంపాలి
- జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- ముందస్తు సన్నద్ధతపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో అనుక్ష ణం అప్రమత్తత, అత్యున్నత సన్నద్ధత, ముందస్తు ప్రణాళికతో అన్ని స్థాయిల్లో యంత్రాంగం పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుం దన్న వాతావరణ శాఖ సమాచారం నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుం డా చూడాలని ఆదేశించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు తుఫాన్ ముందస్తు సన్నద్ధత చర్యలపై అధికారులతో సమీక్షించారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవసరమైన సూచనలు చేయాలని ఆదేశించారు. ఎక్కడా ప్రాణనష్టం జరగకూడదు...ఆస్తినష్టం సాధ్య మైనంత తగ్గించాలని సూచించారు. ప్రజల ఫోన్లకు నిరంతరం సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాలని, ప్రభుత్వ సూచనలు పాటించేలా తీర ప్రాంతాల్లో గ్రామాల ప్రజలను సన్నద్ధం చేయా లని సూచించారు. శాటిలైట్ల సమాచారంతో సైంటిఫిక్ డేటా ఆధారంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**గర్భిణులను ముందే ఆసుపత్రులకు తరలించాలి**

తుఫాన్ వల్ల గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలుస్తోం ది. విద్యుత్ శాఖ పూర్తి సన్నద్ధతతో ఉండి విద్యుత్ పునరుద్ధరణ వేగంగా జరిగేలా చూడాలి. సముద్రంపై వేటకు వెళ్లిన అన్ని బోట్లు తీరానికి వచ్చేలా చూడాలి. భారీ వర్షాలతో వచ్చే వరదతో నీటి వనరులను నింపేందుకు అవసరమైన అన్ని చర్యలు ఇరిగేషన్ శాఖ తీసుకోవాలి. జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా అన్నిస్థాయిలలో ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి. ఒకసారి తుఫాన్ ప్రభావం మొదలై రాకపోకలకు ఆటంకం కలిగితే గర్భిణీలు ఇబ్బందులు పడతారు. ఈ వారంలో కాన్పులు అయ్యే గర్భిణీలను ముందుగానే ఆసుపత్రికి తరలించాలి. తాగునీరు, ఆహారం పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలి. వీటికి నిధుల కొరత లేకుండా కలెక్టర్లు చూసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో వసతులు, సౌకర్యా లు ఉండాలి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజల నుంచి చిన్న ఫిర్యాదు కూడా రాకూడదు. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ దెబ్బతింటే వెంటనే పునరుద్ధరించేలా ఏజెన్సీలను సిద్ధం చేయాలి. ఈ విషయంలో జాప్యం చేయరాదని ఆదేశించారు. సివిల్ సప్లై, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, హోం, ఫైర్, వ్యవసాయ శాఖ అధికా రులు తుఫాను సన్నద్ధత చర్యలను సీఎంకు వివరించారు.

**విశాఖ-బాపట్ల మధ్య 28వ తేదీన తీరం దాటే అవకాశం**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని అధికారులు వివరించా రు. అక్టోబరు 28 మధ్యాహ్నానికి బాపట్ల- విశాఖపట్నం మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉంది. ప్రస్తుత అంచనాల్లో కోనసీమ-యానాం-కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉంది. ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా సుమారు 850 కిలోమీటర్లు, కాకినాడకు సుమారు 930 కిలోమీటర్ల దూరంలో వాయుగుండంగా ఉంది. అక్టోబరు 26 సోమవారం ఉదయానికి తుఫాన్‌గా, అదేరోజు రాత్రికి తీవ్ర తుఫాన్‌గా, 27న అతి తీవ్ర తుఫాన్‌గా బలపడుతుంది. తీరం దాటే సమయంలో గంటకు 115 - 125 కిలోమీటర్ల వేగంతో గాలులు...కొన్ని సందర్భాల్లో 140 కిలోమీటర్ల వేగంతో ఈదు రుగాలులు వీచే అవకాశం ఉంది అని అధికారులు వివరిం చారు. ప్రతి నాలుగు గంటలకు తుఫాన్‌పై బులిటెన్ విడుదల చేయాలని సీఎం సూచించారు.

**భారీ, అతి భారీ వర్షాలు**

తుఫాన్ ప్రభావంతో అక్టోబరు 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తా యి. కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రపైనా గాలులు, వర్ష ప్రభావం ఉంటుంది. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 292.55 మి.మీ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మి.మీ, విశాఖపట్నంలో 253.87 మి.మీ, శ్రీకాకుళంలో 249.18 మి.మీ వర్షపాతం పడవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు మొత్తం వర్షపాతం 95 మి.మీ.గా ఉంటుందని అంచనా వేయగా... ప్రభావిత జిల్లాల్లో సగటున 22-29 సెం.మీ వర్షపాతానికి అవకాశం ఉందని అధికారులు వివరిం చారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీష్ గుప్తా, జిల్లా కలెక్టర్లు, రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు, వ్యవసాయం, విద్యుత్, ఇరిగేషన్, హోం, వైద్య ఆరోగ్య, పౌర సరఫరాలు, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గంగవరం బీచ్ అందాలు అద్భుతం

**- ఆనంద్ మహీంద్రా ఫిదా**



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీం ద్రా ఫిదా అయ్యారు. దేశంలో ఎక్కువ మంది మాట్లాడుకునే తీరప్రాంత ప్రదేశాల్లో ఎందుకు లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఇది మనకు తెలిసిన కొబ్బరి చెట్లు, పచ్చదనం దృశ్యాలు కనిపించే సాధారణ బీచ్ లాంటిది కాదు.

ఎత్తయిన రాతి కొండలతో కఠినమైన, ఒకవిధమైన పురాతన అందం ఇక్కడ కనిపిస్తోంది. ఇలాంటి సహజ సౌందర్యమే నన్ను ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇక్కడ సేద తీరడమే కాకుండా.. ప్రశాంతంగా కాసేపు ఆత్మపరిశీలన కూడా చేసుకోవచ్చు. ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు.. భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి వైజాగ్కు వస్తున్నాయి. కానీ, ఇక్కడి దృశ్యాలను చూస్తుంటే లక్షల ఏళ్ల క్రితమే ప్రకృతి పెద్దఎత్తున విస్తరణ ప్రక్రియను మొదలుపెట్టినట్లు అనిపిస్తోంది. విశాఖపట్నం ప్రధాన టెక్ హబ్ గా వేగంగా మారుతోంది. అదేవిధంగా అత్యంత అద్భుతమైన తీరప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగొందే సత్తా దీనికి ఉందని భావిస్తున్నా" అని ఆనంద్ మహీంద్రా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలతో ఏకీభవించారు.








# భోగాపురం-ఢిల్లీ ఎయిర్‌లైన్స్ సేవలు ప్రారంభం

విజయనగరం(చైతన్యరథం): జిల్లాలోని భోగాపురం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. మూడేళ్ల విరామం తర్వాత ఈ సేవలు అందుబాటులోకి రావడంతో విమాన ప్రయాణికుల్లో ఆసక్తి నె కొంది. ఢిల్లీకి వెళ్లే ప్రయాణికులతో తొలి విమానం బయలుదేరింది. ఈ సర్వీసుల ప్రారంభంతో భోగాపురం నుంచి ఢిల్లీకి ప్రయాణించాలనుకునే వారికి విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. రాజధానికి వెళ్లే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణి కులకు ఈ విమాన సేవలు ఉపయో గకరంగా మారనున్నాయి. విమాన ప్రయాణం ద్వారా సమయం ఆదా చేసుకోవడంతో పాటు ప్రయాణాన్ని మరింత సౌకర్య వంతంగా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వివిధ పనుల నిమిత్తం తరచూ ఢిల్లీకి వెళ్లే వారికి ఈ సర్వీసులు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ఆకాశ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీసుల ప్రారంభంతో భోగాపురం నుంచి విమాన ప్రయాణా లకు మరింత ప్రాధాన్యం ఏర్పడనుంది. ఢిల్లీ వంటి ప్రధాన నగరానికి నేరుగా విమాన సదుపాయం అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణికులు తమ అవసరాలకు అనుగుణంగా ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవచ్చు. వ్యాపార సమావేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, విద్యా సంబంధిత అవసరా లు, వ్యక్తిగత పర్యటనల కోసం ఢిల్లీ వెళ్లే వారికి ఈ సేవలు తోడ్పడనున్నాయి. విమాన సర్వీసుల నిర్వహణ, ప్రయాణ సమయాలు, టికెట్ ధరలు, రాకపోకల షెడ్యూల్ వంటి వివరా లు ప్రయాణికులకు కీలకం కానున్నాయి. మూడేళ్ల విరామం తర్వాత విమాన సేవలు తిరిగి ప్రారంభం కావడంతో భోగా పురం నుంచి ఢిల్లీకి ప్రయాణించే వారి అవసరాలకు అనుగు ణంగా ఈ సర్వీసులు ఎంతమేరకు ఉపయోగపడతాయన్నది ఆసక్తికరంగా మారింది.



# ప్రజాస్వామ్యం ముసుగులో రాజకీయ రణరంగం!

- ఎన్నికల్లో పోటీ కంటే వివాదాలకే ప్రాధాన్యమా?
- అధికారంలో ఒక తీరు..ప్రతిపక్షంలో మరో తీరు
- అల్లర్లు, ఆరోపణల మధ్య అసలు సమస్య పక్కదారి
- నాటి వైసీపీ పాలనలో అరాచకాలు ప్రజలు మరువరు
- వ్యవస్థలపై నమ్మకం మాటల్లో కాదు.. చేతల్లో కనిపించాలి!

రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదు. ప్రజల తీర్పే అంతి మం. ఈ సత్యాన్ని మరిచిపోయిన పార్టీలు ప్రజలకు దూరం కాక తప్పదు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల మనసు గెలుచుకునే ప్రయ త్నం చేయాలి. తప్పులుంటే సరిదిద్దుకోవాలి. ప్రజా సమస్యలపై పోరాడాలి. కానీ ఓటమి నుంచి బయటపడటానికి హింసా రాజకీ యాలను ప్రధాన అస్త్రంగా మార్చుకుంటే మాత్రం అసలు లక్ష్యం పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పరిణామాలు ఇలాంటి ప్రశ్నలనే ముందుకు తెస్తున్నాయి.

నాడు అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలకు నామినేషన్లు వేసే అవకాశం కూడా లేకుండా ప్రజలను భయభ్రాంతులు చేసి అరాచ కాలు సృష్టించిన గొడ్డలి పార్టీ..ఇప్పుడు ప్రతిపక్షంలోనూ అదే పంథా ఎంచుకుంది. అంతటితో ఆగకుండా ఆ పార్టీ అధినేత ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ సుద్దపూస మాటలు మాట్లాడటం హాస్యాస్పదం. గత వైసీపీ పాలనలో స్థానిక ఎన్నికల సమయంలో బెదిరింపులు, ఒత్తిళ్లు, ఏకగ్రీవాలపై వచ్చిన వివాదాలు ప్రజలకు తెలియనివి కావు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. అధికార పీఠం మారింది. ప్రజల తీర్పు మారింది. అయినప్పటికీ ఆ పార్టీ నాటి పంథానే కొనసాగిస్తోంది. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. ప్రజాస్వామ్యం అంటే అధికారంలో ఉన్నప్పుడు ఒకలా..ప్రతిపక్షం లో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడమా? లేక పరిస్థితులు ఎలా ఉన్నా ఒకే విధానాన్ని పాటించడమా?

## అధికారం పోయినా పాత రాజకీయ పోకడలు మారలేదా?

స్థానిక సంస్థల ఎన్నికలు ఏ రాజకీయ పార్టీకైనా ప్రజల్లో తన బలాన్ని నిరూపించుకునే అవకాశం. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో ప్రజలకు అభ్యర్థులతో ప్రత్యక్ష సంబంధం ఉం టుంది. వీధిలో రహదారి ఎలా ఉంది? తాగునీరు సక్రమంగా వస్తోందా? పారిశుద్ధ్యం బాగుందా? తమ సమస్యలను ఎవరు పట్టించుకుంటున్నారు? అనే స్థానిక సమస్యల అంశాలే ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే స్థానిక ఎన్నికలను కేవలం పార్టీల బలాబలాల పోరుగా కాకుండా, ప్రజల రోజువారీ జీవితానికి సంబంధించిన ఎన్నికలుగా చూడాలి. మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం పూర్తవగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోం ది. అధికారికంగా విపక్ష హోదా లేకపోయినా, రాజకీయంగా బలాన్ని తిరిగి పెంచుకోవాలనుకునే ఏ పార్టీకి అయినా ఇది మంచి అవకాశం. అభ్యర్థులను నిలబెట్టి, ప్రజల్లోకి వెళ్లి, తమ విధానాలను వివరించి అధికార పక్షం పనితీరుపై ప్రశ్నలు సంధించవచ్చు. కానీ ఆ మార్గంలో వెళ్లకుండా ఎన్నికల ప్రక్రియ చుట్టూ వివాదాలు ముదిరితే ప్రజలకు ఏం సందేశం వెళుతుంది? ప్రజల్లో బలం నిరూపించుకోవాల్సిన సమయంలో వివాదాలే ప్రధా న చర్చగా మారితే, రాజకీయ పోరాటం లక్ష్యం మారిపోయినట్టే. ఎన్నికల్లో ప్రజల తీర్పును ఎదుర్కోవడం ఒక ఎత్తయితే, ఎన్నికల నిర్వహణపై నిరంతరం అనుమానాలు వ్యక్తం చేయడం మరో ఎత్తు. నిజంగా అక్రమాలు జరిగితే వాటిని ఆధారాలతో బయట పెట్టాలి. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేలా పోరాడాలి. కానీ ప్రతి ఘటననూ రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవాలనే ధోరణి ఉంటే ప్రజల్లో విశ్వాసం పెరగడం కష్టం.

## ప్రజాస్వామ్యం అంటే మాటలు కాదు..

ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడటం సులభం. ఆచరణలోనూ అది ఉండాలి. ప్రత్యర్థి అభ్యర్థి కూడా స్వేచ్ఛగా నామినేషన్ వేయగలగడం, ప్రచారం చేసుకోగలగడం, ఓటర్లను కలుసుకోగలగడం, ఎలాంటి భయం లేకుండా ఎన్నికల్లో పాల్గొన గలగడం నిజమైన ప్రజాస్వామ్యానికి గుర్తులు. ఇవి అధికార పక్షానికే కాదు, ప్రతిపక్షానికీ వర్తిస్తాయి. ఎవరు అధికారంలో ఉన్నారనే దానితో సంబంధం లేకుండా ఈ సూత్రాలు అమల వ్వాలి. గతంలో ఎన్నికల సమయంలో ప్రత్యర్థులను అడ్డుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్న వారు... ఇప్పుడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతున్నప్పుడు, గతంలో తమ పాలనలో జరిగిన పరిణామాలపై కూడా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అదే సమయంలో ప్రస్తుత పాలకులపై వచ్చే ఆరోపణలను కూడా తేలి గ్గా తీసుకోకూడదు. ప్రజాస్వామ్యానికి కావాల్సింది రాజకీయ ప్రతీకారం కాదు.. నిష్పాక్షికమైన న్యాయం.

ఒకవేళ అధికార పక్షానికి చెందినవారు ఎవరైనా ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించినా, నామినేషన్లను అడ్డుకున్నా, అధికారులపై ఒత్తిడి తెచ్చినా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ప్రతిపక్షానికి చెందినవారు హింసకు పాల్పడినా, ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నా చట్టం తన పని తాను చేయాలి. తప్పు ఎవరు చేసినా తప్పే. రాజకీయ రంగును బట్టి నేరం స్వభావం మారదు. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. తాను చేస్తే రాజకీయం.. ఎదుటివాడు చేస్తే అరాచకం అనే ధోరణి ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. తమకు అనుకూలమైనప్పుడు వ్యవస్థలను ప్రశంసించడం, ప్రతికూలమైనప్పుడు వాటి విశ్వసనీ యతను ప్రశ్నించడం ద్వారా ఏ పార్టీ కూడా ప్రజల్లో శాశ్వత నమ్మకాన్ని సంపాదించుకోలేదు.

## సుప్రీంకోర్టు ఆదేశాలపై రాజకీయ వ్యాఖ్యానాలెందుకు?

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివాదాలు న్యాయస్థానాల వరకు వెళ్లడం కొత్త విషయం కాదు. ఎన్నికల్లో అక్రమాలు జరిగా యని ఎవరైనా భావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ఉంది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. సంబంధిత అధికారుల నుంచి విచారణ కోరవచ్చు. అయితే న్యాయస్థానం ఒక అంశాన్ని పరిశీలించాలని ఆదేశించిందంటే ఒక పక్షం ఆరోపణలు నిజమని తేలిపోయినట్టు కాదు. తాత్కాలిక ఆదేశం, తుది తీర్పు రెండింటి మధ్య తేడా ఉంటుంది. ఈ తేడాను పక్కనపెట్టి న్యాయస్థానాల వ్యాఖ్యలకు తమకు అనుకూలమైన అర్థాలు చెప్పడం రాజకీయ వాతావరణాన్ని మరింత గందరగోళంలోకి నెడుతుంది.

న్యాయ స్థానాలను ఆశ్రయించినప్పుడు వాటి నిర్ణయాలను గౌరవించాలి. తీర్పు తమకు అనుకూలంగా లేకపోతే చట్టబద్ధమైన మార్గాల్లో తదుపరి చర్యలు తీసుకోవచ్చు. కానీ విచారణ పూర్తికాకముందే తామే తుది నిర్ణయం ప్రకటించినట్టు మాట్లాడటం సరైన పద్ధతి కాదు. గతంలో ఎన్నికల సంఘం నిర్ణయాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన రాజకీయ నాయకులు.. ఇప్పుడు అదే వ్యవస్థ ను ఆశ్రయించి న్యాయం కోరడం తప్పు కాదు. అయితే వ్యవస్థ లపై నమ్మకం అనేది మనకు నచ్చిన నిర్ణయాలు వచ్చినప్పుడే చూపించే విషయం కాకూడదు. ఎన్నికల సంఘం అయినా, న్యాయస్థానం అయినా, పోలీసు వ్యవస్థ అయినా.. వాటి పని తీరులో లోపాలుంటే ఆధారాలతో ప్రశ్నించాలి. అదే సమయం లో వాటి నిర్ణయాలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిం చకూడదు.

## గొడవలు ఎక్కడ జరిగాయి? బాధ్యులెవరు?

స్థానిక ఎన్నికల నామినేషన్ల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు, దాడులు, అధికారులతో వాగ్వాదాలు చోటుచేసుకు న్నాయని పరస్పర ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలకు నష్టం కలిగించడం, అభ్యర్థులను అడ్డుకోవడం, రిటర్నింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చడం వంటి ఆరోపణలు కూడా రాజకీ య చర్చల్లోకి వచ్చాయి. మరోవైపు అధికార పక్షమే పోలీసు వ్యవస్థను ఉపయోగించుకుని దాడులు చేయిస్తోందని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. ఈ ఆరోపణల్లో ఏవి నిజం? ఎక్కడ ఎలాంటి ఘటనలు జరిగాయి? ఎవరు బాధ్యులు? అన్నది రాజకీయ వేదికలపై చేసే ప్రకటనలతో తేలిపోదు. వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, పోలీసుల నివేదికలు, ఎన్నికల అధికారు ల వివరాలు పరిశీలించాలి. ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ జరగాలి. తప్పు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ ఎన్నికల్లో వేల సంఖ్యలో నామి నేషన్లు దాఖలైనప్పటికీ కొన్ని ప్రాంతాల్లోనే ఘర్షణలు చోటు చేసుకున్నాయని చెప్పి వాటిని విస్మరించడం సరికాదు. నిప్పు ఎక్కడ అంటుకుందో తెలుసుకోకుండా పొగను చూసి తీర్పు చెప్పలేం. అలాగే రాజకీయ ఆరోపణలు వినగానే ఎవరు దోషులో నిర్ణయించలేం. ఆధారాలు మాట్లాడాలి. విచారణ నిజాన్ని బయటపెట్టాలి. చట్టం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

## ఎన్నికల వివాదాల వెనుక నిధుల అంశం కూడా కీలకమే!

స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల రాష్ట్రానికి కేంద్ర ఆర్థిక సంఘం నిధుల విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. స్థానిక సంస్థలు కేవలం ఎన్నికల రాజకీయాలకు పరిమి తమైన వ్యవస్థలు కావు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, మురుగు కాలువలు వంటి అనేక అవసరాలను తీర్చడంలో వాటి పాత్ర కీలకం. ఎన్నికలు సకాలంలో జరగడం, ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు ముందుకు సాగడం ప్రజలకు అవసరం. ఎన్నికల నిర్వహణపై వివాదాలు ఎక్కువకాలం కొనసాగితే పరిపాలనా ప్రక్రియపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కేంద్ర నిధుల విడుదలకు సంబంధించిన అంశాల్లోనూ సంబంధిత నిబంధనలు, మార్గద ర్శకాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే నిధులు ఆగిపో తాయనే రాజకీయ ప్రకటనతోనే పరిస్థితి నిర్ధారణ కాదు. ఏ నిధులకు ఏ నిబంధనలు వర్తిస్తాయి? ఎన్నికలు ఆలస్యమైతే ఎలాంటి ప్రభావం ఉంటుంది? అన్నది అధికారిక మార్గదర్శకా ల ఆధారంగా స్పష్టం చేయాలి. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో రాజకీయ పార్టీలు పరస్పరం నిందించుకోవడం కంటే, ప్రజలకు నష్టం జరగకుండా చూడటంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే స్థానిక సంస్థలకు అందాల్సిన నిధులు నాయకుల వ్యక్తిగత ప్రయోజనాల కోసం కావు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కోసం. రాజకీయ వివాదాల మధ్య ప్రజల అవసరాలు వెనుకబడిపోతే చివరకు నష్టపోయేది సామాన్యులే.

## ఏకగ్రీవాల వెనుక అసలు కథ ఏమిటి?

గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భయపెట్టి ఏకగ్రీవాలు సాధించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో ప్రతిపక్షానికి అభ్యర్థులు దొరకక ఏకగ్రీవాలు జరుగుతున్నాయని అధికార పక్షం వాదిస్తోంది. ఈ రెండు వాద నల మధ్య అసలు నిజాన్ని గుర్తించడం అవసరం. ఏకగ్రీవం కావడం తప్పు కాదు. ఒక అభ్యర్థికి ప్రజల్లో విస్తృత మద్దతు ఉండవచ్చు. ప్రత్యర్థులు పోటీకి ముందుకు రాకపోవచ్చు. అటువంటి సందర్భాల్లో ఏకగ్రీవం సహజంగానే జరగవచ్చు. కానీ బెదిరింపులు, బలవంతం, నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిళ్లు కారణమైతే అది తీవ్రమైన విషయం. ఏకగ్రీవం జరిగిన ప్రతి స్థానాన్ని అనుమానంతో చూడలేం. అదే సమయంలో ఏకగ్రీవం జరిగిందనే కారణంతో ఎలాంటి అక్రమాలు జరగలే దని కూడా చెప్పలేం. ఇక్కడ రాజకీయ పార్టీల బాధ్యత స్పష్టంగా ఉంటుంది. తమకు అనుకూలంగా ఏకగ్రీవం జరిగితే ప్రజల మద్దతుగా చెప్పుకోవడం, ప్రత్యర్థికి అనుకూలంగా జరిగితే అక్రమమని ఆరోపించడం మానుకోవాలి. ప్రతి సందర్భంలోనూ ఒకే ప్రమాణాన్ని పాటించాలి. ప్రజల స్వచ్ఛంద నిర్ణయాన్ని గౌరవించాలి. బలవంతానికి తావులేకుండా చూడాలి. ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ముందుకురావడం, ఓటర్లు స్వేచ్ఛ గా నిర్ణయం తీసుకోవడం, ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించడం జరిగితేనే ఎన్నికల ఫలితాలకు నిజమై న విలువ ఉంటుంది.

## తప్పుడు ప్రచారాల రాజకీయమా?వాస్తవాల పోరాటమా?

ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులపై ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు సహజంగానే పెరుగుతా యి. అయితే ఒక వార్త నిజమా కాదా అన్నది పరిశీలించకుండానే ప్రచారం చేయడం, వ్యక్తుల వ్యాఖ్యలను వక్రీకరించ డం, ఆధారాలు లేని విషయాలను నిజాలుగా చూపించడం రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తాయి. రాజకీయ నాయకులపై విమర్శలు చేయకూడదని ఎవరూ చెప్పలేరు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. వారి నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. కానీ విమర్శకు, అసత్య ప్రచారానికి మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఒక నిర్ణయాన్ని ఆధారాలతో విమర్శించడం ప్రజాస్వామ్యం. నిర్ధారణ కాని ఆరోపణలను నిజాలుగా ప్రచారం చేయడం మాత్రం ప్రజల్లో అపోహలను పెంచుతుంది. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ పార్టీలు సంయమనంతో వ్యవహరించాలి. తమపై తప్పుడు ప్రచారం జరిగిందని భావిస్తే ఆధారాలను బయటపెట్టాలి. అవసరమైతే చట్టపరమైన

(తరువాయి 4లో..)




# ప్రజాస్వామ్యం ముసుగులో రాజకీయ రణరంగం!

కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

జమ్ము సాయికల్యాణ్, అనలిస్ట్, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్

(3వ పేజీ తరువాయి..)

చర్యలు తీసుకోవాలి. ప్రతి ప్రచారానికీ ఆవేశంతో స్పందించడం కంటే వాస్తవాలను ప్రజలకు వివరించడం మంచిది. అదే సమయంలో తమపై వచ్చే న్యాయమైన విమర్శలను కూడా ఎదుర్కొనే సిద్ధత ఉండాలి.

## కూటమికి అసలు పరీక్ష ఇప్పుడు మొదలైంది!

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు కూడా కొన్ని కీలక సవాళ్లు ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక, రెబల్ అభ్యర్థుల సమస్యలు, స్థానిక నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల అసంతృప్తి వంటి అంశాలను సకాలంలో పరిష్కరించుకోవాలి. పైస్థాయిలో నాయకు లు సమావేశమై వ్యూహాలు రూపొందించడం ఎంత ముఖ్యమో, క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ప్రత్యర్థులపై విమర్శలు చేయడం మాత్రమే ఎన్నికల్లో విజయానికి సరిపోదు. ప్రజలు తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు జరిగాయా? ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? స్థానిక సమస్యలపై స్పందన ఎలా ఉంది? అన్న విషయాలను కూడా పరిశీలిస్తారు. అందుకే కూటమి నాయకత్వం అభివృద్ధి, సంక్షేమం, స్థానిక అవసరాల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. ఎక్కడైనా తమ పార్టీకి చెందిన వారు తప్పు చేసినా చర్యలకు సహకరించాలి. ప్రతిపక్షానికి న్యాయమైన అవకాశం కల్పించాలి. ఎన్నికల యంత్రాంగం స్వతంత్రంగా పనిచేసే వాతావరణాన్ని కాపాడాలి. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడే మాటలకు ఆచరణలో విలువ ఉంటుంది. ప్రత్యర్థి తప్పులను ఎత్తిచూపడం రాజకీయాల్లో ఒక భాగమే. కానీ తమ బాధ్యతలను విస్మరించి ప్రత్యర్థి వైఫల్యాలపైనే ఆధారపడితే ప్రజల్లో దీర్ఘకాలిక విశ్వాసం సంపాదించడం కష్టం. పాలనలో పనితీరు, ఎన్నికల్లో పారదర్శకత, ప్రజల పట్ల జవాబుదారీతనం.. ఇవే అధికార పక్షానికి అసలైన పరీక్షలు. ఎవరు తమ సమస్యలను పరిష్కరిస్తారో వారినే ఆదరించాలా వద్దా అన్నది ప్రజల నిర్ణయం. రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని గుర్తించాలి. వివాదాల ద్వారా కొంతకాలం ప్రచారం పొందవచ్చు. ప్రత్యర్థిపై ఆరోపణలతో వార్తల్లో నిలవవచ్చు. కానీ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఉంటే ఆ ప్రచారం వల్ల ఉపయోగం ఉండదు. స్థానిక ఎన్నికలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే వేదికగా నిలవాలి తప్ప, రాజకీయ కక్షల ప్రదర్శనకు వేదిక కాకూడదు.

## ప్రజాస్వామ్యానికి కావాల్సింది నిబద్ధత!

స్థానిక సంస్థల ఎన్నికల చుట్టూ జరుగుతున్న పరిణామాలు రాజకీయ పార్టీలకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యం అనేది నినాదాలతో కాపాడేది కాదు. ప్రత్యర్థులకు సమాన అవకాశం ఇవ్వడం, ఎన్నికల నిబంధనలను గౌరవించడం, ఆరోపణలను ఆధారాలతో నిరూపించడం, న్యాయస్థానాల ఆదేశాలను పాటించడం, తప్పు చేసిన వారిపై చర్యలకు సహకరించడం ద్వారా మాత్రమే దాన్ని బలోపేతం చేయగలం. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరించే రాజకీయా లకు ప్రజల్లో విశ్వసనీయత నిలవడం కష్టం. గతంలో ఎవరు ఏం చేశారన్నది ఒక ప్రశ్న అయితే, ఇప్పుడు ఎవరు ఎలా వ్యవహరిస్తు న్నారన్నది మరో ప్రశ్న. ఈ రెండింటినీ ప్రజలు గమనిస్తారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులకు శిక్ష పడాలి. ఆరోపణలు నిరాధారమైతే అవి చేసిన వారు ప్రజలకు సమాధానం చెప్పాలి. రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యం ఉండటం సహజం. కానీ ఆ లక్ష్యం కోసం ప్రజాస్వామ్య వ్యవస్థలపై అనవసర అనుమానాలు రేకెత్తించడం, ఎన్నికల ప్రక్రియను వివాదాల్లోకి నెట్టడం, ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించడం ఎవరికీ మేలు చేయదు. చివరికి గెలవాల్సింది ఏ పార్టీ అహంకారమో, ఏ నాయకుడి వ్యూహమో కాదు.. ప్రజాస్వామ్యమే. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి. ప్రజలు స్వేచ్ఛగా తమ ప్రతినిధులను ఎన్నుకోవాలి. ఎన్నికైన వారు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అదే నిజమైన ప్రజాస్వామ్య పరిరక్షణ. మిగతాదంతా రాజకీయ హడావుడిగానే మిగిలిపోతుంది.

# స్థానిక ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలి

- కూటమి అభ్యర్థుల ఘన విజయానికి శ్రేణులు కృషి చేయాలి
- వైసీపీకి ఒక్క ఓటు వేసినా నష్టమే
- రెండేళ్లలో పాలకొల్లు నియోజకవర్గానికి రూ.1,300 కోట్ల నిధులు
- అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకు వివరించాలని కూటమి శ్రేణులకు మంత్రి నిమ్మల పిలుపు



పాలకొల్లు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయం సాధించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని గడపగడపకు తీసుకెళ్లి వివరించాలని సూచించారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని తన కార్యాలయం వద్ద ఆదివారం పాలకొల్లు, ఎలమంచిలి మండలాలకు చెందిన కూటమి ముఖ్య నాయకులు, శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో ఓటు వేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వ పనితీరును వివరించాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి వేసే ప్రతి ఓటు గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మార్గం వేస్తుందని మంత్రి పేర్కొన్నారు. వైసీపీకి ఓటు వేయడం వల్ల నష్టమేననే విషయం అందరికీ అర్థమయ్యేలా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా వాస్తవంగా గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. గత రెండేళ్లలో చేసిన పనులతోపాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలనూ ప్రజలకు తెలియజేయాలన్నారు.

పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్లు నిమ్మల రామానాయుడు తెలిపారు. గత రెండేళ్లలో నియోజకవర్గానికి సుమారు రూ.1,300 కోట్ల నిధులు తీసుకొచ్చి వివిధ అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ వివిధ మార్గాల్లో నిధులు సమీకరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో సిమెంట్ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి పథకాలు, పుంత రహదారులు, విద్యుత్ సదుపాయాల కల్పన, తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ రహదారులను మెరుగుపరిచామన్నారు. ప్రతి గ్రామంలో చేపట్టిన పనులను గుర్తించి, వాటివల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు.

నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.19.60 కోట్ల ఆర్థిక సాయం అందేలా కృషి చేసినట్లు మంత్రి తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ తమకు కలిగిన ప్రయోజనాన్ని ఇతరులకు వివరించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలన్నారు.

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమన్వయంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కొనసాగుతున్న డబుల్ ఇంజిన్ పాలనకు స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు తోడైతే ట్రిపుల్ ఇంజిన్ పాలన ఏర్పడి గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి గ్రామంలోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల వారీగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రజలకు అవగాహన కల్పించి కూటమికి మద్దతు కూడగట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు.

# పట్టణాల అభివృద్ధే మా అజెండా



- కూటమి అభ్యర్థులను ఘనంగా గెలిపించండి
- రామచంద్రపురం ఓటర్లకు మంత్రి సుభాష్ పిలుపు
- 14, 20, 23వ వార్డుల్లో మంత్రి విస్తృత ప్రచారం
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిందేమిటని నిలదీత

రామచంద్రపురం (చైతన్యరథం): డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులు దూసుకెళుతున్నారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 14, 20, 23వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు ఆయా వార్డుల కూటమి అభ్యర్థులు లంక శ్రీను, కవల నారాయణమూర్తి (నానాజీ) వైట్ల సూర్య ప్రకాష్ , నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు.

ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పట్టణ ప్రగతికి, ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించి, చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు ఆయా వార్డుల కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రం సర్వనాశనం

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. గతంలో ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతూ అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఐదేళ్లలో రాష్ట్రానికి, పట్టణానికి ఏం చేశారో ప్రజల ముందు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అప్పగించిన అధికారాన్ని రాష్ట్రాభివృద్ధికి వినియోగించాల్సిన బాధ్యతను విస్మరించిన గత పాలకులు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సర్వనాశనం చేసి వెళ్లారని ధ్వజమెత్తారు. ప్రజల సమస్యల పరిష్కారం, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో గత పాలనను ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలన్నా, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తరించాలన్నా స్థానిక సంస్థల్లోనూ అభివృద్ధికి కట్టుబడి పనిచేసే ప్రతినిధులు ఉండాలని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి, వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, స్థానిక సమస్యలకు పరిష్కారాలు చూపించడం తమ ప్రాధాన్యతలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకే పరిమితం కాకుండా, వాటిని కార్యరూపంలోకి తీసుకురావడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.

## కూటమి అభ్యర్థులకు అండగా నిలవండి

రామచంద్రపురం పట్టణ అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని తెలిపారు. పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేందుకు కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావు, ఆయా వార్డుల కూటమి అభ్యర్థులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో...

# విద్యుత్ ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు

- క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, గొట్టిపాటి

అమరావతి (చైతన్యరథం): అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు విద్యుత్ అధికారులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు.

## వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలి..



విద్యుత్ సమస్యలు తలెత్తితే.. వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రులు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ శాఖలో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులంతా అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఇతర శాఖలతో విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని మార్గనిర్దేశం చేశారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాలకు అదనపు సిబ్బందిని పంపేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. కిందపడిన కరెంట్ వైర్లు, స్తంభాల దగ్గర ప్రజలు జాగ్రత్త వహించాలని మార్గనిర్దేశం చేశారు. విద్యుత్ సమస్యలుంటే 1912 నంబర్‌కు ప్రజలు సమాచారం అందించాలని మంత్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ కోరారు. కాగా 25 వేల స్తంభాలను, ఇతర సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేసినట్లు మంత్రులకు అధికారులు వెల్లడించారు.

## ‘చెప్పాం-చేస్తున్నాం’..

# సగర్వంగా చెప్పుకుంటున్నాం

- అది సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ గొప్పతనం
- ‘చెప్పాం- చెయ్యం’ అనే నైజం జగన్ రెడ్డిది
- వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి
- చెత్తపన్ను పేరుతో ప్రజలపై రూ.200 కోట్లు భారం మోపిన చెత్త ప్రభుత్వం
- భద్రత సాకు చూపి మేనకోడలి పెళ్లిని అడ్డుకోవటం అన్యాయం
- హిందూ సాంప్రదాయాలంటే విలువ లేని జగన్ రాష్ట్రానికి అవసరమా?
- గొడ్డలిపార్టీ ఆగమ శాస్త్రాన్ని ఆగం చేస్తే.. పరిరక్షిస్తున్న కూటమి ప్రభుత్వం
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్



అమరావతి (చైతన్యరథం): ‘చెప్పాం – చేస్తున్నాం’ అని సగర్వంగా చెప్పుకునే ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమని బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు.

**మేనిఫెస్టో హామీల అమలుకు ప్రాధాన్యత**

సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తోందని, ఇప్పటికే సుమారు 80 శాతం హామీలను పూర్తి చేసిందని బుచ్చి రామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. జగన్ ఐదేళ్ల చెత్త పాలనతో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు.

**పారిశుద్ధ్య రంగంలో మార్పులకు శ్రీకారం**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా చెత్త పేరుకుపోయి అనేక ప్రాంతాలు చెత్త కుప్పలుగా మారాయని బుచ్చి రామ్‌ప్రసాద్ విమర్శించారు. చెత్త పన్ను పేరుతో ప్రజలపై రూ.200 కోట్లు ఆర్థిక భారం మోపారని ఆరోపించారు. గత ప్రభుత్వం సుమారు 1.5 లక్షల టన్నుల చెత్తను వదిలివెళ్లిందని, అందులో 80 శాతం చెత్తను కూటమి ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు నగరాల్లో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ‘వేస్ట్ టు ఎనర్జీ’ ప్లాంట్ల ఏర్పాటుతో పారిశుద్ధ్య నిర్వహణకు కొత్త దిశ చూపుతున్నామని పేర్కొన్నారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యర్థాలను వనరులుగా మార్చే విధానాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

**‘చెప్పాం- కాని చెయ్యం’.. ఇదే జగన్ నైజం**

‘చెప్పాం- చేస్తున్నాం’ చంద్రబాబు విధానమైతే... ‘చెప్పాం- చెయ్యం’ అనేది జగన్ మనస్తత్వం అని విమర్శించారు. బుడమేరు వరదల సమయంలో విజయవాడ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలిచారని బుచ్చి రామ్‌ప్రసాద్ గుర్తుచేశారు. వరద ముంపు ప్రాంతాల్లోకి పడవలు, జేసీబీలలో సీఎం చంద్రబాబు స్వయంగా వెళ్లి బాధితులకు భరోసా కల్పించారన్నారు. బుడమేరు పక్కన ఉన్న భూముల్లో వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లు వైసీపీ వాళ్లవేనని విమర్శించారు. వరద బాధితులకు రూ. కోటి రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన జగన్.. వాటిని ఎవరికి ఇచ్చారో కూడా తెలియదని ఎద్దేవా చేశారు.

**జగన్ మేనమామ కాదు కంసమామ**

కుటుంబ సంబంధాలు, హిందూ సంప్రదాయాల విషయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును బుచ్చి రామ్‌ప్రసాద్ తీవ్రంగా తప్పుబట్టారు. మేనకోడలి పెళ్లిని వ్యక్తిగత భద్రత వంటి అంశాలతో ముడిపెట్టి వ్యవహరించడం సరికాదని వ్యాఖ్యానించారు. హిందూ సంప్రదాయాలు, కుటుంబ విలువలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. సంప్రదాయాలు, విలువలు పాటించని వ్యక్తి.. తల్లిని, చెల్లిని గౌరవించలేని వ్యక్తి, బాబాయిని చంపించిన వాళ్లకి రక్షణగా నిలుస్తున్న జగన్ లాంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమా అనేది ప్రజలు గమనించాలన్నారు.

**బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట**

బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని బుచ్చి రామ్‌ప్రసాద్ చెప్పారు. జగన్ హయాంలో ఆగమ శాస్త్రాన్ని ఆగం చేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో బ్రాహ్మణులకు రక్షణ కరవైందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అర్చకుల కనీస వేతనాన్ని నెలకు రూ.15,000కు పెంచిందని, దేవాలయాల నిర్వహణకు అందించే ఆర్థిక సహాయాన్ని గతంలో నెలకు రూ.5వేలు నుంచి రూ.10,000కు, కొన్ని ఆలయాలకు రూ.15,000 వరకు పెంచిందని తెలిపారు. ఈ చర్యలు చిన్న ఆలయాల నిర్వహణకు, అర్చకుల జీవనోపాధికి తోడ్పడతాయని పేర్కొన్నారు.

**స్థానిక ఎన్నికల్లోనూ కూటమికి మద్దతివ్వండి**

2024 ఎన్నికల్లో బ్రాహ్మణులు కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచినట్లుగానే, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మద్దతుగా నిలవాలని బుచ్చి రామ్‌ప్రసాద్ కోరారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, బ్రాహ్మణుల సంక్షేమం, ఆలయాల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బుచ్చి రామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు.

## దౌర్జన్యాలు, అక్రమాలు, దాడులు..

# ఇవే జగన్ రాజకీయ అస్త్రాలు

- మేనకోడలి పెళ్లికి అడ్డుపడటం దారుణం
- మీ హయాంలో స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయా?
- మాచర్లలో నాపై, బొండా ఉమాపై జరిగిన హత్యాయత్నం మాటేమిటి?
- నాడు బలవంతపు ఏకగ్రీవాలు, హత్యాయత్నాలు, హత్యలతో యథేచ్ఛగా విధ్వంసం
- టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ధ్వజం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా జగన్ రెడ్డి విషప్రచారం చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న మండిపడ్డారు. ఎన్నికలంటే దౌర్జన్యాలు, అక్రమాలు, రిగ్గింగ్ చేయడమే జగన్మోహన్ రెడ్డికి తెలిసిన రాజకీయమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ జరుగుతుంటే అల్లర్లు సృష్టించి ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ పార్టీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. కూటమి పార్టీలకు పోటీపడి మరీ నామినేషన్లు వేసి కూడా వైసీపీ నేతలను అడ్డుకున్నారంటూ దొంగ ఎడ్పులు ఏడవటం సబబేనా అని ప్రశ్నించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బుద్ధా వెంకన్న మాట్లాడుతూ దాడుల గురించి మాట్లాడేటప్పుడు 2020 మాచర్లలో తనపై జరిగిన హత్యాయత్నాన్ని కూడా జగన్ రెడ్డి ప్రస్తావించాలని ఎద్దేవా చేశారు.

**2021 వైసీపీ విధ్వంసాలు ప్రజలు మరిచిపోలేదు?**

2021 స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా జరిగాయని జగన్మోహన్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. ఆ ఎన్నికల్లో వైసీపీ విధ్వంసకాండను దేశం మొత్తం చూసింది. 2020 మాచర్లలో నాపై, బోండా ఉమా, హైకోర్టు న్యాయమూర్తి పారా కిషోర్ పై వైసీపీ మూకలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇనుప రాడ్లతో రౌడీలను మాపై వదిలారు. హిందూపురంలో ఎన్నికల కేంద్రంపై దాడి చేశారు. నెల్లూరు జిల్లా కావలిలో వైసీపీ ఓడిపోవడంతో మా పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. పిఠాపురంలో ఏకంగా బ్యాలెట్ బాక్సులు ఎత్తికెళ్లిపోయారు. గుంటూరులోని మారెల్లవారిపాలెంలో రిగ్గింగ్‌తో ఓట్లు వేసుకుంది మీరు కాదా? ఇలా ఆ ఎన్నికల్లో బలవంతంగా మా పార్టీ అభ్యర్థులతో 1045 నామినేషన్లు ఉపసంహరింపజేశారు. 322 అక్రమ కేసులు పెట్టారు. 182 చోట్ల ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు, 48 హత్యాయత్నాలు, 3 హత్యలు చేసి ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని చెబితే ప్రజలు నమ్ముతారా అని దుయ్యబట్టారు.

**భారీగా నామినేషన్లు..మరోవైపు దొంగ ఏడ్పులు**

వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది. అందుకే కేసుల పేరుతో ఎన్నికలు అడ్డుకోవాలని చూశారు. అది కుదరకపోవడంతో ఇప్పుడు నామినేషన్ల పర్వంపై డ్రామాలు మొదలు పెట్టారు. రాష్ట్రంలో ప్రతిచోట వైసీపీ నాయకులు కూటమి పార్టీలకు పోటీగా నామినేషన్లు వేశారు. వైసీపీ నుంచి ఎంపీటీసీ స్థానాలకు 20,556, జడ్పీటీసీ స్థానాలకు 1,815 నామినేషన్లు వేశారు. మరోవైపు నామినేషన్లు వేయనీయ లేదని గగ్గోలు పెడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైనా పద్ధతేనా అని బుద్ధా ప్రశ్నించారు.

**మేనమామ కాదు కలియుగ కంసమామ**

ఆగర్భ శత్రువులను సైతం పెళ్లి అనే బంధం కలుపుతుంది.. అలాంటి పెళ్లి, వివాహ సంప్రదాయాలపై జగన్ రెడ్డికి నమ్మకం లేదు. తండ్రి తర్వాత తండ్రి లాంటి వారు మేనమామ. వివాహ సంప్రదాయం ప్రకారం మేనమామే స్వయంగా మేనకోడలు పెళ్లి దగ్గరుండి చేస్తారు. అలాంటి మేనకోడలు పెళ్లికి భద్రత పేరుతో ఇల్లు ఇవ్వకపోవడం దుర్మార్గం. ఆస్తి కోసం సొంత చెల్లి, అమ్మను ఇంటి నుంచి గెంటేసిన మనసత్వం ప్రపంచంలో ఎవరికీ ఉండదు. మేనకోడలు పెళ్లికి స్థలం ఇవ్వకుండా అడ్డుపడిన కలియుగ కంసమామ జగన్మోహన్ రెడ్డి. ఆయనకు రాజకీయ విలువలు లేవు. మానవతా విలువలు అసలే లేవని బుద్ధా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## నాడు దోపిడీలు, దౌర్జన్యాలు..

# నేడు ఓట్ల కోసం సేవ్ వైజాగ్ అనడం సిగ్గుచేటు

- విశాఖ ప్రజలు చైతన్యవంతులు, గొడ్డలి పార్టీ డ్రామాలు నమ్మరు
- దేశంలోనే నెంబర్ వన్ నగరంగా విశాఖను సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారు
- జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయం
- విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డా. డోలా



అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల పాలన మొత్తం విశాఖలో దోపిడీలు, దౌర్జన్యాలు చేసిన గొడ్డలి పార్టీ గ్యాంగ్ నేడు ఓట్ల కోసం సేవ్ వైజాగ్ అనడం సిగ్గుచేటని విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. నాడు విశాఖలో భూ కబ్జాలు, దందాలు, సెటిల్మెంట్లు ఇలా జగన్ అండ్ కో..చేయని అరాచకాలు లేవని దుయ్యబట్టారు. కమీషన్ల కక్కుర్తితో కంపెనీల తరిమేసి యువతను జగన్ రోడ్డున పడేశారని, కూటమి ప్రభుత్వంలో రెండున్నరేళ్లలోనే విశాఖ నగరానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు, ఐటీ కంపెనీలు తెచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించామన్నారు. సీఎం చంద్రబాబు కృషి వల్లే విశాఖ రైల్వే జోన్, భోగాపురం ఎయిర్పోర్ట్ సాధ్యమైందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు 30 టీఎంసీల నీరు అందించామని తెలిపారు. దేశంలోనే నెంబర్ వన్ నగరంగా విశాఖను సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారని, ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకొని విశాఖ నగరాన్ని దోచుకోవడం తప్ప జగన్ చేసింది ఏంటని మంత్రి ప్రశ్నించారు. విశాఖ ప్రజలు చైతన్యవంతులు.. గొడ్డలి పార్టీ డ్రామాలు నమ్మే పరిస్థితిలో లేరని జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయమని ఆదివారం ఒక ప్రకటనలో మంత్రి డా.స్వామి ధీమా వ్యక్తం చేశారు.

# 20 ఏళ్ల ఇంటి స్థలాల పట్టాల నిరీక్షణకు తెర

## - మంత్రి నిమ్మలకు జిన్నూరు చాకిరేవుగుంట ప్రాంతవాసుల కృతజ్ఞతలు

పాలకొల్లు (చైతన్యరథం): రెండు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల పట్టాల కోసం ఎదురుచూస్తున్న తమ కల సాకారం కావడంతో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పోడూరు మండలం జిన్నూరు గ్రామం చాకిరేవుగుంట ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కృషితో తమకు ఇళ్ల స్థలాల పట్టాలు లభించాయని పేర్కొంటూ ఆదివారం పాలకొల్లులోని మంత్రి కార్యాలయానికి చేరుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న స్థలాలకు హక్కు పత్రాలు లేకపోవడంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ప్రాంతవాసులు తెలిపారు. రెండు దశాబ్దాల నిరీక్షణ తర్వాత తమ స్థలాలకు పట్టాలు అందడంతో కుటుంబాలకు సొంత ఆస్తి సమకూరిందనే సంతోషం కలిగిందన్నారు. తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి రామానాయుడికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ కుటుంబాల్లో ఆనందం నింపిన ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల పట్టాలు అందడంతో ప్రజలు తనకు కృతజ్ఞతలు తెలపడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.

ప్రజలకు మేలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలుస్తూ మంచి ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతు కొనసాగించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



# జగన్‌ను ఓడించి విశాఖను సేవ్ చేసుకున్న ప్రజలు

- నేడు 'సేవ్ వైజాగ్' పేరుతో గొడ్డలిపార్టీ కొత్త డ్రామాలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో మిగిలింది విధ్వంసమే
- కూటమి పాలనలో విశాఖ, ఉత్తరాంధ్రలో అభివృద్ధి పరుగులు
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం (చైతన్యరథం): ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి విశాఖకు ఏం చేశారో చెప్పుకోలేని స్థితిలో గొడ్డలి పార్టీ నాయకులు ఉన్నారని విశాఖ జిల్లా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే నేడు సేవ్ వైజాగ్ పేరుతో కొత్త డ్రామా మొదలుపెట్టారని విమర్శించారు. 2024 ఎన్నికల్లో జగన్ రెడ్డిని, వైసీపీని ఓడించి విశాఖను ప్రజలే కాపాడుకున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో విశాఖ నగరాన్ని, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేశారు. విశాఖ ప్రజలు 2014లో తన తల్లిని ఎంపీగా ఓడించారనే కక్షతో ఈ ప్రాంతంపై జగన్ వివక్ష చూపించారు. మేం గూగుల్ తీసుకొచ్చి ప్రోత్సహిస్తే... జగన్ రెడ్డి గంజాయి మాఫియాను ప్రోత్సహించారు. విశాఖ రైల్వే జోన్‌కు జగన్ అడ్డుపడితే... మేం అవసరమైన స్థలం కేటాయించి విశాఖ రైల్వే జోన్ సాధించాం. భోగాపురం విమానాశ్రయానికి కేటాయించిన 500 ఎకరాలను కాజేసేందుకు జగన్ కుట్ర చేశాడు. రుషికొండపై విలాసవంతమైన భవనాల నిర్మాణానికి రూ.500 కోట్లు ఖర్చు చేసిన జగన్...విశాఖ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు రూపాయి ఖర్చు చేయలేదు. జగన్ హయాంలో విశాఖ వచ్చిన కంపెనీలు పక్క రాష్ట్రాలకు పారిపోయాయి. కూటమి ప్రభుత్వంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నాం. భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి చేశాం. విశాఖ అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి అవుతుంటే... గొడ్డలి పార్టీ నాయకులు కుట్రలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ 30 టీఎంసీల నీటిని ఉమ్మడి విశాఖ జిల్లాకు అందజేస్తున్నాం. గూగుల్ సంస్థపై, డేటా సెంటర్లపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. ఉత్తరాంధ్రకు కొత్త భవిష్యత్తును అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ఎన్నికల్లో మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి ఓటమి ఖాయమని ఆదివారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే గంటా ధీమా వ్యక్తం చేశారు.



# మహిళల ద్రోహి జగన్

- సొంత మేనకోడలి పెళ్లిని అడ్డుకుంటున్న కంసమామ
- మహిళల అభివృద్ధి, సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట
- 11 సీట్లకు పరిమితం చేసినా తీరుమారని గొడ్డలిపార్టీ
- ఓటమి భయంతో స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు
- ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత



అమరావతి (చైతన్యరథం): ఎన్నికల ముందు రాష్ట్రంలోని పిల్లలందరికీ మేనమామనంటూ ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డి... వాస్తవ జీవితంలో సొంత మేనకోడలి పెళ్లిని అడ్డుకుంటూ కంసమామలా మారారని ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పిస్తే... జగన్ రెడ్డి మహిళల ఆస్తి హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. సొంత కుటుంబంలోని మహిళలకే న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని మహిళలకు ఏ విధంగా మేలు చేయగలరని ప్రశ్నించారు. రక్త సంబంధాలకు విలువ ఇవ్వని వ్యక్తి జగన్ రెడ్డి.. ఆస్తిపై వ్యామోహంతో కుటుంబ సంబంధాలను కూడా పక్కనపెట్టడం దారుణం. ఎలహంకలో కరెన్సీ నోట్లు దాచిన బంకర్ల వ్యవహారం బయటపడుతుందనే భయంతోనే మేనకోడలి పెళ్లికి జగన్ అడ్డుపడుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివిధ కార్యక్రమాలు, ఈవెంట్లు సెట్టింగులు వేసి నిర్వహించినప్పుడు భద్రతా సమస్యలు గుర్తుకు రాలేదా? ఇప్పుడు మాత్రం భద్రత పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో జగన్ చెప్పాలి. తల్లికి, చెల్లికి న్యాయం చేయని జగన్ రెడ్డి మహిళల పట్ల తన వైఖరిని తానే బయటపెట్టుకున్నారు. పిన్నమ్మ తాళి తెంచిన నేరస్థులకు అండగా నిలుస్తున్నారు. మహిళలకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తూ మహిళా ద్రోహిగా జగన్ మిగిలిపోయారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు గతంలో చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా విత్తనం నేడు మహా వృక్షంగా ఎదిగి లక్షలాది మంది మహిళలకు అండగా నిలుస్తోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలను పెంచడం, సంక్షేమ ఫలాలను వారికి చేరవేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పీతల సుజాత స్పష్టం చేశారు.

**ఓటమి భయంతోనే..**

ఎన్నికల్లో ఓడిపోతామని ముందే తెలిసి స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారు. ఆ భయంతోనే సుప్రీంకోర్టు, హైకోర్టులో 59 కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ రెడ్డికి ఇంకా బుద్ధి రాలేదు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. స్థానిక సంస్థలకు అందాల్సిన 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.16,500 కోట్లు రాకుండా అడ్డుకోవడమే ఏకైక ధ్యేయంగా జగన్ రెడ్డి కుయుక్తులు పన్నుతున్నారని పీతల సుజాత మండిపడ్డారు.

**మరింత మెరుగైన సంక్షేమం**

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోంది. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశాం. రెండున్నరేళ్లలోనే రూ.1.50 లక్షల కోట్ల నిధులను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందజేశాం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో పెన్షన్లకు కేవలం రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే... కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే 63 లక్షల మందికి రూ.79 వేల కోట్లు పెన్షన్ రూపంలో అందజేసింది. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద సాయం అంతమందికి అందజేస్తున్నాం. ఇప్పటివరకు 43 లక్షల మంది తల్లులకు రూ.20 వేల కోట్లు జమ చేశాం. 47 లక్షల మంది రైతన్నలకు ఏటా రూ.20 వేల చొప్పున అన్నదాత సుఖీభవ సాయం అందజేస్తున్నాం. దీపం 2 పథకం ద్వారా 5 కోట్ల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేశాం. ఉచిత బస్సు పథకానికి రూ.3,550 కోట్లు ఖర్చు చేశాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా డీఎస్సీ, పోలీస్ వంటి 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 10 వేల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. రికార్డ్ స్థాయిలో రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులను ఏపీకి తీసుకొచ్చాం. రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన భోజనం అందజేస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం 85 శాతం హామీలను విస్మరిస్తే, కూటమి ప్రభుత్వం 90 శాతం హామీలను అమలు చేసింది. స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమికే ప్రజలు మరోసారి ఓటు వేసేలా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని పీతల సుజాత

# మైపాడకు మద్దతుగా కూటమి నేతల ప్రచారం

## సంక్షేమాభివృద్ధికి ఓటు వేయాలని ప్రజలకు పిలుపు



నెల్లిమర్ల (చైతన్యరథం): నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థి మైపాడ ప్రసాద్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బీజేపీ నాయకులు అరవింద్ సింగ్ భడోరియా, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి మైపాడ ప్రసాద్‌ను కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు ప్రచారంలో ప్రస్తావించారు.

ఎన్టీఆర్ భరోసా పించన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, వంటి పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం కూటమి అభ్యర్థి ను గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి మైపాడ ప్రసాద్‌కు మద్దతుగా ప్రజలను కలిసి, అభ్యర్థి గుర్తు కమలం అని వివరిస్తూ ప్రచారం చేపట్టారు. కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



# జీవీఎంసీపై కూటమి జెండా ఎగరాలి

## విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పట్టాభిరామ్ పిలుపు

విశాఖపట్టణం (చైతన్యరథం): జీవీఎంసీ ఎన్నికల్లో భాగంగా 21వ వార్డు ఆదర్శనగర్‌లో విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ స్థానిక కార్పొరేటర్ అభ్యర్థి కాళ్ల లలిత శంకర్ తో కలిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటకీ తిరిగి కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు, ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ ఎక్కడ చూసినా కూటమి గాలి వీస్తుంది అని, కూటమి ప్రభుత్వం చేసిన మంచి మన అభ్యర్థులను గెలిపిస్తుంది అని చెప్పారు, ఈ కార్యక్రమంలో 21 వ వార్డు టిడిపి అధ్యక్షుడు సత్తిబాబు, జనసేన ఇంచార్జి శ్రీనివాస్ పట్నాయక్, నాయకులు వర, రాము, కృష్ణ, పరమేశ్, గోపమ్మ, తదితరులు పాల్గొన్నారు

# భారతిపై దాడి అమానుషం : ఎమ్మెల్యే మిరియాల

అడ్డతీగల (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు హేయమైన చర్య అని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అడ్డతీగల మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శనివారం రెండువర్గాల మధ్య కత్తులతో దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. దీనిలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బీజేపీ నేత బొమ్మిడి భారతి అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఆమె వెంటనే హుటాహుటీన అడ్డతీగల ఆసుపత్రికి చేరుకుని పరిస్థితి పై ఆరా తీశారు. ఇక్కడ నుండి రాజమహేంద్రవరం ఆసుపత్రి కి రిఫర్ చేయగా ఆమె దగ్గరుండి క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో ఎక్కించే వరకు అక్కడే ఉండి పరిస్థితిని చక్కబెట్టారు. కార్యక్రమంలో ఆమె వెంట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే కోసూరి కాశీ విశ్వనాథ్, అడ్డతీగల మండల పార్టీ అధ్యక్షులు జర్తా వెంకటరమణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, బీజేపీ నాయకులు కుంజం సత్యనారాయణమ్మ, తెదేపా నాయకులు ఎడ్ల శ్రీనివాస్, జారగెడ్డ మాణిక్యాల రావు, ఆదారి నాగబాబు, వంక సతీష్, దుప్పటి రాజశేఖర్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జి గుంజిగెడ్డ గంగరాజు, పుడిగి ఆదిలక్ష్మి ,బీర బాలయోగి తదితరులు పాల్గొన్నారు.





విశాఖపట్నం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం అభిషేక్ కిషోర్‌ను విశాఖపట్నం పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చౌడేపట్టాభిరామ్ కలిశారు. అంతకుముందు విశాఖపట్నం జిల్లా ఎంపీటీసీ/జడ్పిటిసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నియామక పత్రం ఫారం ఏను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆయనకు అందజేశారు. విశాఖపట్నం పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనుమతితో జిల్లా తెలుగుదేశం పార్టీ ఆఫీస్ కార్యదర్శి నెక్కంటి రూపసత్య వెంకటేశం, సీనియర్ నాయకులు యర్నాగుల జగదీష్ కలిసి కలెక్టర్ కు అందజేశారు.

# అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

## చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్, జనసేన అభ్యర్థి సుధా స్వర్ణ మహేశ్వరికి మద్దతుగా ఎంపీ సానా సతీష్ బాబు ప్రచారం



అమలాపురం: అమలాపురం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎన్నికల పరిశీలకులు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, అమలాపురం లోక్‌సభ సభ్యుడు గంటి హరీష్ మాధుర్ బాలయోగితో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమలాపురం మున్సిపాలిటీలోని 12వ వార్డులో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి శ్రీమతి సుధా స్వర్ణ మహేశ్వరి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో అమలాపురం మున్సిపాలిటీలో ఘన విజయం సాధిస్తామనే ధీమాను నాయకులు వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, గంధం పల్లం రాజు, మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు, ఎంఎన్‌వీ ప్రసాద్ తదితర నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



తొలి రోజు ఎన్నికల ప్రచారంలోనే అందరినీ ఆకట్టుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని కుమార్తె నవ్యశ్రీ



# అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

## పశ్చిమ టీడీపీ ఇన్చార్జి వెంకన్న పిలుపు

విజయవాడ పశ్చిమ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 38వ డివిజన్ భగత్ సింగ్ నగర్ ఎన్నికల ప్రచారంలో పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న పాల్గొన్నారు. జనసేన పార్టీ మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను తెలుగుదేశం పార్టీ 38వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పత్తి నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ నగర్‌లో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తూ, స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. కూటమి నాయకులు సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి, డివిజన్ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ స్థానిక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు వంటి ప్రజలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. 38వ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కూటమి నాయకుల సమన్వయంతో ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్.కె కాజా, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ప్రసాద్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల ఇంటి పట్టాల నిరీక్షణకు తెర

## మంత్రి నిమ్మలకు జిన్నూరు చాకిరేవుగుంట వాసుల కృతజ్ఞతలు



పాలకొల్లు (చైతన్యరథం): రెండు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల పట్టాల కోసం ఎదురుచూస్తున్న తమ కల సాకారం కావడంతో పోడూరు మండలం జిన్నూరు గ్రామం చాకిరేవుగుంట ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కృషితో తమకు ఇళ్ల స్థలాల పట్టాలు లభించాయని పేర్కొంటూ ఆదివారం పాలకొల్లులోని మంత్రి కార్యాలయానికి చేరుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న స్థలాలకు హక్కు పత్రాలు లేకపోవడంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ప్రాంతవాసులు తెలిపారు. రెండు దశాబ్దాల నిరీక్షణ తర్వాత తమ స్థలాలకు పట్టాలు అందడంతో కుటుంబాలకు సొంత ఆస్తి సమకూరిందనే సంతోషం కలిగిందన్నారు. తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ కుటుంబాల్లో ఆనందం నింపిన ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల పట్టాలు అందడంతో ప్రజలు తనకు కృతజ్ఞతలు తెలపడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజలకు మేలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలుస్తూ మంచి ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతు కొనసాగించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



# కూటమికి ఓటేసి అభివృద్ధిని గెలిపించండి

## చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య పిలుపు

చీరాల (చైతన్యరథం): పట్టణ స్థానిక కూటమి అభ్యర్థులు 33 వ వార్డు మువ్వల శ్రీనివాసరావు 22వ వార్డు చెవిటి బాలసుబ్రమణ్యం కూటమి పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి హనీ స్పందన విజయమే లక్ష్యంగా చేపట్టిన ప్రచార కార్యక్రమంలో చీరాల శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం ఎలా పరుగులు పెడుతున్నాయో ప్రజలంతా చూస్తున్నారన్నారు. ఇదే అభివృద్ధి ప్రతి వార్డుకు నేరుగా చేరాలంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి నాయకులను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కూటమి బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, మన ప్రాంతాల అభివృద్ధికి ప్రజలే శ్రీకారం చుట్టాలని మనస్ఫూర్తిగా కోరారు. "చెప్పాం... చేస్తున్నాం" అన్న నినాదంతో స్థానిక ఎన్నికల్లో ప్రజల ముందుకు కూటమి ప్రభుత్వం వచ్చిందన్నారు. మాట నిలబెట్టుకున్నాం కాబట్టే గర్వంగా ప్రజల ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నామని కూటమి ప్రభుత్వం గర్వంగా చెప్పుకుంటోందన్నారు. స్థానిక ఎన్నికల్లో కూడా తమను గెలిపించి జరుగుతున్న అభివృద్ధిని, ఇస్తున్న సంక్షేమాన్నీ కొనసాగేలా చూడమంటోందన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. చీరాల పట్టణం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలన్నా, ఎలాంటి రాజకీయ రగడలు లేని ప్రశాంతమైన సుందరమైన పట్టణంగా రూపుదిద్దుకోవాలన్నా కూటమి ప్రభుత్వ అభ్యర్థుల గెలుపు ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే కొండయ్య నాయకత్వంలో చీరాల మున్సిపాలిటీలో చైర్మన్ పీఠంతో పాటు మెజారిటీ కౌన్సిలర్ స్థానాలను కూటమి పార్టీలు ఘనవిజయం సాధిస్తాయని స్థానిక ప్రజలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించడంతో ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది కార్యక్రమంలో చీరాల అబ్జర్వర్ ూవీజ చిలకలూరిపేట చైర్మన్ షేక్ కరీముల్లా, చీరాల యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్, స్థానిక ప్రముఖులు, కూటమి పార్టీల నాయకులు, మిత్రపక్షాల నేతలు మహిళా నాయికలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



# మచిలీపట్టణంలో వైసీపీ మటాష్

## 200 మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరిక, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్టణం (చైతన్యరథం): మాజీ మంత్రి కృష్ణా జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేర్ని నాని ప్రాతినిథ్యం వహించే మచిలీపట్నం నియోజకవర్గంలో ఆ పార్టీకి భారీ షాక్ తగిలింది. నియోజకవర్గ పరిధిలోనే తాళ్లపాలెం గ్రామం నుంచి దాదాపు 200 మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు రాష్ట్ర గనులు భూగర్భవనలు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు రాళ్లపాలెం గ్రామానికి చెందిన వాలిశెట్టి రవిశంకర్, జొన్నల పెద్ద పుల్లయ్య, జొన్నల రామ్మోహన్రావు, గంజాల ఉయ్యూరు, కోమట్ల స్వామి రెడ్డి, కోమట్ల ముత్యాల రెడ్డి, మల్లె రాజు, దొంపాటి వసంతరావు, పసుపులేటి గణేష్, కందాల శ్రీధర్, కందాల అశోక్, మైలపల్లి నాగేశ్వరరావు తదితర ప్రముఖ నాయకులు కార్యకర్తలు టిడిపిలో చేరారు ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు అదే రీతిలో మచిలీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని విధానంతో ముందుకెళుతుందన్నారు మచిలీపట్నం పోర్టు నిర్మాణంతో పాటు మంగినపూడి బీచ్ అభివృద్ధి పారిశ్రామికరణ పెంపుదల ఉపాధి అవకాశాలు తదితర అభివృద్ధి పనులతో కొత్త ఉత్తేజాన్ని తీసుకొచ్చేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామన్నారు కూటమి ప్రభుత్వానికి ప్రజలు అందిస్తున్న సహకారం ముఖ్యంగా మచిలీపట్నం నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి లభిస్తున్న మద్దతు హర్షణీ యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ బీసీ లీడర్ కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య )మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర అనిర్వచనీయం : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి (చైతన్యరథం): పట్టణంలోని గోశాల కళ్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపారంతో పాటు సమాజ సేవలో, దానధర్మాలలో ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. సత్తెనపల్లి అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర మరువలేనిదని అన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆర్యవైశ్య బంధువులను కోరారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు కన్నాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పెద్దలు, వ్యాపార ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# లూథరన్ చర్చిలో లక్ష్మీ అపర్ణ ప్రత్యేక ప్రార్థనలు

## నాని మేలును గుర్తుచేసుకున్న ఫాదర్, మేయర్ అభ్యర్థి విజయం కోసంప్రార్థనలు

గుంటూరు (చైతన్యరథం): లాడ్జి సెంటర్‌లోని నార్త్ పారిష్ లూథరన్ చర్చిలో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విజయం సాధించాలని చర్చి సంఘ సభ్యులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ మాట్లాడుతూ.. కోవెలమూడి నాని మేయర్‌గా ఉన్న సమయంలో చర్చి నిర్మాణానికి సంబంధించి ఎదురైన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కులమతాలకు అతీతంగా స్పందించిన నాని తమకు సహకరించారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు పొందడంలో కొంత జాప్యం జరిగినప్పటికీ, నాని చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి సహాయం చేశారని గుర్తుచేసుకున్నారు. గతంలో తమకు అందించిన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ, కోవెలమూడి లక్ష్మీ అపర్ణ విజయం సాధించాలని చర్చి సంఘ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ డాక్టర్ ఎస్.జె. బాబురావు, పురుషోత్తం చౌదరి, శామ్యూల్ జాన్, పాస్టర్ కిరణ్, రెవరెండ్ ఆర్. మధుబాబు పాల్గొన్నారు.






# అవసరమైతే సొంత నిధులతో నిర్వాసితులకు పరిహారం

## విపక్షాల విమర్శలపై విరుచుకుపడిన కేంద్రమంత్రి పెమ్మసాని

గుంటూరు (చైతన్యరథం): నగరానికి చెందిన మార్వాడి సంఘ ఆత్మీయ సమావేశం నగరంలోని స్థానిక ఓ కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగింది. సంఘ పెద్దల ఆహ్వానం మేరకు ఈ సమావేశానికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు కూటమి ప్రభుత్వం బలపరిచిన మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో కలిసి ఆదివారం పాలొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఏ ప్రాంతంలో అయినా ఉద్యోగాలు రావాలన్నా, ఆర్థిక అభివృద్ధి జరగాలన్న స్మాల్, మీడియం పరిశ్రమలు, వ్యాపారాలు ఉంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే సమాజ సంప్రదాయాలను పాటిస్తూ, ఉమ్మడి కుటుంబాల స్ఫూర్తిని 10 మందికి పంచుతున్న మార్వాడి, జైన్ సోదరుల సంప్రదాయాలు ఈ సమాజానికి మార్గదర్శకం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. గతంలో భారతదేశంలో మొబైల్ కంపెనీ తయారు చేసే కంపెనీలు రెండే ఉంటే, వాటిని ఎన్నో రెట్లు పెంచిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే చెందుతుందన్నారు. 12 సంవత్సరాల క్రితం కంటే ఈరోజు 50 రెట్లు విద్యుత్ మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచిన ఘనత మన మోదీ దక్కించుకున్నారన్నారు. విమానాశ్రయాలు, రహదారులు, జాతీయ రహదారులు, పరిశ్రమలు సాంకేతిక పరంగా ఈ రాష్ట్రం, భారతదేశం అభివృద్ధి చెందుతోందన్నారు. ఒక సామాన్యుడి ఆదాయం రూ. 12 లక్షల లోపు ఏడాదికి ఉండే వారికి ఆదాయ పన్ను లేకుండా మినహాయింపు ఇచ్చిన ఘనత ఈ కేంద్ర ప్రభుత్వానికే తగ్గుతుంది. అలాంటి గొప్ప ఆశయాలు ఉన్న బీజేపీ ప్రభుత్వానికి తెలుగుదేశం పార్టీ, జనసేన నిరంతరం వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. ఒకప్పుడు స్టాక్ మార్కెట్లో విదేశీ పెట్టుబడులు ఎంతో గొప్పగా ఉండేవి. ఇప్పుడు కొంతమంది చేస్తున్న వివాదాల కారణంగా స్టాక్ మార్కెట్ల విలువ తగ్గిపోతోందన్నారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. ఇవాళ దాదాపు రూ. 600 కోట్ల రూపాయలతో 7 ఆర్.ఓ.బి.లను తీసుకువచ్చామని వెల్లడించారు. రూ.571 కోట్లతో అమృత్ భారత్ 2.0 ద్వారా తాగునీటి సౌకర్యాలను తీసుకువచ్చామన్నారు. రూ. 400 కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ఈరోజు శంకర్ విలాస్ వద్ద బ్రిడ్జి నిర్మాణం శరవేగంగా జరుగుతున్నా సరే, కొందరు ఎన్నో విమర్శలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అవసరమైతే తన సొంత డబ్బులు ఇచ్చి, నష్టపరిహారం అందించి మరీ, శంకర్ విలాస్ వంతెన నిర్మాణానికి పూర్తి చేయడానికి బాధ్యత తీసుకుంటానన్నారు. మీరెప్పుడూ వివాదాలకు, సమస్యలకు దూరంగా ఉంటూ అభివృద్ధిని, సంక్షేమాన్ని కోరుకునే మార్వాడి, జైన్ సోదరుల మనోభావాలను గౌరవించే విధంగా తాము బాధ్యత తీసుకుంటామన్నారు. మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ గుంటూరు అభివృద్ధిలో మార్వాడి సంఘ సభ్యుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు.

ఈ మార్వాడి సంఘం తరపున చేస్తున్నటువంటి గో సేవ, సామాజిక సేవ ఎంతో అభినందించగలిగిందని ప్రశంసించారు. నగరానికి ముఖ్యంగా కావాల్సిన మౌలిక సదుపాయాలను, అభివృద్ధిని చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమావేశం వేదికగా మాకు భారీ మెజారిటీ అందించవలసిందిగా కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కోవెలమూడి (రవీంద్ర) నాని, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా బిజెపి అధ్యక్షుడు, తిరుపతి రావు, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, మాజీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (బాబు), జుగ్ రాజ్ జైన్ భండారి, వినోద్ జైన్, రాజేంద్ర జైన్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి పట్టం కట్టండి

## ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ పిలుపు

విజయవాడ (చైతన్యరథం): స్థానిక సంస్థలు బలోపేతం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా 18వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి పఠాన్ హయత్ ఖాన్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. డివిజన్ లోని ప్రతి గడపకు వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు, అమరావతి అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో రెండున్నరేళ్ల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకించి అమరావతి, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి కూటమికి ఓటు వేయాలని కోరారు. కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో మెరుగైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో విజయవాడను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని, ఎన్నికల్లో కూటమిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.





# తూర్పున హోరెత్తిన కూటమి ప్రచారం

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కూటమి నేతల విస్తృతంగా ఎన్నికల ప్రచారం జరిగింది. మాచవరం, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల ప్రాంతాల్లో ప్రజలతో మమేకమైన ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కూటమి తరపున పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులు అలుపెరుగని రీతిలో పర్యటించారు. విజయవాడ నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2, 4, 5, 6, 7, 8, 9వ డివిజన్ల పరిధిలోని మాచవరం, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, గుణదల ప్రాంతాల్లో మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు నేతలకు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించగా, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానం చాటుకున్నారు. ప్రచారంలో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ, విజయవాడ నగరంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను అధిగమించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. కొండ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు. గత 50 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించామని, కొండ ప్రాంతం చుట్టుపక్కల సుమారు 26,500 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కల్పించినట్లు తెలిపారు. ఈ చర్యలతో అనేక కుటుంబాలకు సొంత ఇంటి స్థలం పొందే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న కార్యక్రమాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని ఎంపీ చిన్ని అన్నారు. విజయవాడ అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ సమన్వయంతో పనిచేసే ప్రజాప్రతినిధులు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణతో పాటు కూటమి తరఫున పోటీ చేస్తున్న 86 మంది అభ్యర్థులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా కూటమి నేతలు కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక సంస్థల స్థాయిలోనూ మరింత ఊతం లభించేలా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీ చిన్ని వివరించారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బీజేపీ నేతలతో కలిసి ఐక్యతతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి నగర అభివృద్ధికి ఎంపీ కేశినేని చిన్ని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ప్రజలకు అందించడమే లక్ష్యంగా కూటమి నేతలు పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. విజయవాడ నగర అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక సంస్థల స్థాయిలోనూ సమన్వయం తోడైతే నగర అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని చెప్పారు. కూటమి అభ్యర్థులు ప్రజలతో సమన్వయంతో పనిచేస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సాగిన ప్రచారంలో కూటమి నేతలు స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమాభివృద్ధిని సాధించాం.. ఎన్నికల్లో గెలుస్తున్నాం!

### ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ధీమా



మార్కాపురం (చైతన్యరథం): మున్సిపల్‌ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అందరూ గెలవబోతున్నారని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తెలియజేశారు. మార్కాపురం మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. మార్కాపురం పట్టణంలోని రెండు మూడు వార్డుల్లో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతంలో మొదటి నుండి ఇప్పటివరకు తనకి ప్రజలతో తెలుగుదేశం కార్యకర్తలతో మంచి అనుబంధం ఉందని మొదటి నుంచి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది తానేనని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్లు పూర్తిగా త్వరలోనే అభివృద్ధి చేస్తున్నామని ప్రజలకు ఏ కష్టం వచ్చినా మీ వెన్నంటే ఉంటామని అన్నారు. ఈ ప్రాంతాన్ని గతంలో తామే అభివృద్ధి చేశామని భవిష్యత్తులో కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జునను, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రాంతంలో మునుపెన్నడూ లేని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున, కూటమి నాయకులు వార్డు తెలుగుదేశం, జనసేన, బీజేపి కౌన్సిలర్ అభ్యర్థులు నాయకులు పాల్గొన్నారు.



పెదపాడు మండలం పెదపాడు గ్రామంలో అయ్యప్ప, భవాని, శివ స్వాముల కోసం 42 రోజుల పాటు నిర్వహించనున్న భిక్ష కార్యక్రమాన్ని ఆదివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## స్థానిక ఎన్నికల ప్రచారంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



విశాఖపట్టణం (చైతన్యరథం): తూర్పు నియోజకవర్గం 22వార్డుల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి గొలగాని మంగవేణి తరుపున వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచి ఎంవీపీకాలనీ సెక్టారు-6, సెక్టారు-2ల్లో ఆయన తెదేపా అభ్యర్థిని గొలగాని మంగవేణితో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వహయాంలో విశాఖనగరంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హయాంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. ప్రధానంగా అనునిత్యం ప్రజలతో మమేకమయ్యే గొలగాని మంగవేణితో పాటు మేయరు అభ్యర్థిని ముక్కా శ్రావణికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు అపార్టెమెంట్‌లకు వెళ్లి ఆయా అపార్టెమెంట్ వాసులను కలిసి కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలు చర్చిల్లో ప్రార్థనల్లో సైతం పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా స్థానిక నాయకులు గొలగాని పోలారావు, మసేను, కారి రామారావు, నూకరాజులతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## సమస్యలకు పరిష్కారం చూపని వైసీపీ వినాయకులు

### విపక్షాల విమర్శలపై విరుచుకు పడిన పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

ఉయ్యూరు (చైతన్యరథం): పట్టణంలో గత ఐదేళ్ల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు పరిష్కారం చూపని వైసీపీ వినాయకులు ఇప్పుడు ఎన్నికల సమయంలో అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడే ప్రసాద్ ప్రశ్నించారు. ఉయ్యూరు మున్సిపాలిటీ 6వ వార్డులో కూటమి అభ్యర్థి కూనపరెడ్డి శ్రీనివాస్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై మాట్లాడారు. ప్రజలకు అవసరమైన తాగునీరు,రహదారులు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనలో గత పాలకులు ఏం సాధించారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రశ్నించారు, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల వద్దకు రావడం సరైన విధానం కాదని విమర్శించారు, ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన పనులపై గత పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. డిమాండ్ చేశారు.

#### రూ.100 కోట్ల తాగునీటి ప్రాజెక్టు... కూటమి ప్రభుత్వ కార్యాచరణ

ఉయ్యూరు ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపే లక్ష్యంతో సుమారు రూ.100 కోట్లతో కృష్ణా నది జలాలను శుద్ధి చేసి సరఫరా చేసే ప్రాజెక్టును చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు, ఇన్నేళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు గత పాలకులు ఎందుకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారనినిలదీశారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

#### రూ.18 కోట్లతో రోడ్లు డ్రైనేజీల అభివృద్ధి

ఉయ్యూరు పట్టణంలో రోడ్లు,డ్రైనేజీల అభివృద్ధికి సుమారు రూ.18 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు,గత పాలకుల హయాంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూ పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు, విమర్శలు చేయడం సులభమని,ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేసి చూపించడమే ముఖ్యమని అన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు టిడ్కో గృహ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే గారు తెలిపారు, పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు, గత పాలనలో జరిగిన పరిణామాలను,ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. 6వ వార్డు కూటమి అభ్యర్థి కూనపరెడ్డి శ్రీనివాస్‌కి మద్దతు తెలపాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఓటర్లను కోరారు,వార్డు అభివృద్ధి,స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మాటలతో ప్రజలను మభ్యపెట్టే రాజకీయాల కంటే,అభివృద్ధి పనులతో ప్రజలకు ఫలితాలు అందించడమే ముఖ్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు, ఉయ్యూరు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు.

## సమగ్రాభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

### ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ విజ్ఞప్తి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గం 30వ డివిజన్ శ్రీనివాసరావుపేటలో జనసేన ఎన్డీఏ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి ఆళ్ల శిరీష విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గుంటూరు నగర అభివృద్ధితో పాటు డివిజన్‌లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు, స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి కృషి చేస్తోందని పేర్కొన్నారు. గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో గుంటూరు మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణని, 30వ డివిజన్ జనసేన ఎన్డీఏ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి ఆళ్ళ శిరీషను ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో భారీ మెజారిటీతో గెలిపించాలని మన్నవ మోహనకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల హరి, మల్లె కిషోర్, నైజాం బాబుతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మదనపల్లెలో జోరుగా కూటమి నాయకుల ప్రచారం

మదనపల్లె (చైతన్యరథం): మున్సిపాలిటీలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం జోరందుకుంది. 28వ వార్డులో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శ్రీరామ్ చినబాబుతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, మంత్రి నారా లోకేష్ ముందుచూపుతో రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావాలన్నా, మున్సిపాలిటీలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలన్నా స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరం. ఈ సంకల్పంతో మదనపల్లె అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని సుగవాసి ప్రసాద్ బాబు ప్రజలను కోరారు.



చైతన్యరథం

# జోన్-5

(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)



హిందూపురం నియోజకవర్గం ముదిరెడ్డిపల్లిలో కురుబ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికలలో కూటమి తరపున పోటీ చేయుచున్న మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పట్టణంలోని పాండురంగ నగర్ కనకదాస కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. హిందూపురం మున్సిపల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను భారీ విజయంతో గెలిపించాలని పిలుపునిచ్చారు.





నగరపాలక సంస్థకు జరుగుతున్న ఎన్నికలలో భాగంగా 9, 10, 27, 35, 36 వ డివిజన్ లకు సంబంధించి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చన్నకోనేరు జంక్షన్ (డా. బీసెంట్ స్కూల్) మరియు లెంక వీధి ఆంజనేయస్వామి కోవెల దగ్గర నిర్వహించిన బహిరంగ సభలను నిర్వహించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ కూటమి పార్టీలు బలపర్చిన టీడీపీ మేయర్ అభ్యర్థి, కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మేయర్ అభ్యర్థి అవనాపు భార్గవి, కార్పొరేటర్ అభ్యర్థులు 9 సోము మాధవి, 10 కంది మురళీనాయుడు, 27 బర్ల సత్యవేణి, 35 కుందేటి గణేష్, 36 నంబూరి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

## కొట్యాడలో ఘనంగా 'చెప్పాం.. చేస్తున్నాం'

### పాల్గొన్న ఎల్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



ఎల్.కోట (చైతన్యరథం): ఎల్.కోట మండలం కొట్యాడ గ్రామంలో 'చెప్పాం, చేస్తున్నాం' కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ముఖ్య అతిథిగా పాల్గొని విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను, గ్రామంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు వంటి మౌలిక వసతుల కొరతను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కొట్యాడ గాంధీ, జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు పాల్గొని ఎమ్మెల్యే వెంట నడిచారు. గ్రామాభివృద్ధికి పాలకవర్గం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టీడీపీలో అందరికీ సముచిత స్థానం : ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు

### అనుచరులతో టీడీపీలో చేరిన బొప్పన గాంధీ



విజయవాడ (చైతన్యరథం): మొగల్రాజపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 64వ డివిజన్‌కు చెందిన బొప్పన గాంధీ తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విధానాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వీరమాచినేని లలిత, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

### ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్

విజయవాడ (చైతన్యరథం):ఎన్నో దశాబ్దాల పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీజివో సంఘం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తోందని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్ తెలిపారు. పెన్షనర్ల వయస్సు, ఆరోగ్య అవసరాలు, ఆర్థిక, సాంకేతిక సమస్యలు, పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, పెన్షనర్లకు హెల్త్ కార్డుల ద్వారా పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెల్త్ కార్డుల ద్వారా అందించే వైద్య సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు నేరుగా ట్రస్ట్‌కు చేరేలా చర్యలు చేపడుతున్నామని, తద్వారా ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులు వేగవంతమై, ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని వివరించారు. నగదు రహిత వైద్య సేవల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సుమారు నాలుగు లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ప్రయోజనం పొందుతారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన ఉద్యోగులకు సంబంధించిన సమస్యలన్నిటిని ఒక్కొక్కటి పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. దాదాపు 25 వేల కోట్లకు పైగా పాత బకాయిలను తీర్చడంలో ఏపీఎన్జీవో సంఘం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఎన్జీవో సంఘ సభ్యులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, పదవీ విరమణ అనంతరం పెన్షనర్లుగా మారిన వారే నేటి విశ్రాంత ఉద్యోగులని విద్యాసాగర్ గుర్తుచేశారు. అందువల్ల పెన్షనర్ల సమస్యలను సంఘం తన సమస్యలుగానే భావిస్తుందని, వారి సంక్షేమం, హక్కులు, పదవీ విరమణ ప్రయోజనాల సాధనకు ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. అలాగే, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు మంజూరు చేసి నగదు రహిత వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి జె. రాజారావు, ఎన్జీవో నాయకులు సత్యనారాయణ రెడ్డి, సీవీఆర్ ప్రసాద్, నజీర్, దాస్, పెన్షనర్ల సంఘ నాయకులు డాలి నాయుడు, జి. నారాయణరావు, విష్ణువర్ధన్, విశ్రాంత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు వెంకటేశ్వరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# తానా 'ఫుడ్ డ్రైవ్' ప్రారంభం

## మిడ్ అట్లాంటిక్ యూత్ వాలంటీర్ల సేవా దృక్పథం

## డిసెంబరు 6 వరకు ఆహార సేకరణ

**పెన్సిల్వేనియా:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (TANA) మిడ్ అట్లాంటిక్ యువ స్వచ్ఛంద విభాగం (Mid Atlantic Youth Volunteers) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన 'ఫుడ్ డ్రైవ్ 2026' ఘనంగా ప్రారంభమైంది. చెస్టర్ కౌంటీ ఫుడ్ బ్యాంక్ (Chester County Food Bank) సహకారంతో ఈ నెల 19న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబరు 6వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా పెన్సిల్వేనియాలోని చెస్ట్ నట్ రిడ్జ్, హనీ బ్రూక్ (Chestnut Ridge, Honey Brook, PA) ప్రాంతంలో అక్టోబరు 24, 25 తేదీల్లో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ప్రత్యేక ఆహార సేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. విరాళాలు ఇవ్వదలచుకున్న వారు 237 చాస్టిన్ డ్రైవ్ వద్ద ఏర్పాటుచేసిన కేంద్రంలో వస్తువులను అందజేయవచ్చు.

**సేకరించే ఆహార పదార్థాలు:**
బియ్యం, పాస్తా, సాల్సా, కాండిమెంట్స్, పప్పుధాన్యాలు (ఎండినవి, డబ్బాల్లో నిల్వ చేసినవి), డబ్బాల్లో నిల్వ చేసిన ట్యూనా, చికెన్, వంట నూనెలు (ఆలివ్ & కెనోలా ఆయిల్), తృణ ధాన్యాలు (Cereal & Whole grain), పండ్లు (ఎండినవి, జ్యూస్‌లో నిల్వ చేసిన డబ్బా పండ్లు), రెడీ-టు-ఈట్ మీల్స్, సూప్‌లు (తక్కువ సోడియం, తక్కువ/చక్కెర లేనివాటికి ప్రాధాన్యత)

నేరుగా కార్యక్రమం జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి విరాళాలు ఇవ్వలేని వారు ఆన్‌లైన్ ద్వారా అందించే వెసులుబాటు కల్పించారు. దీని కోసం tana.org/donation/tana/107 లింక్‌ను సందర్శించి లేదా పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విరాళాలు అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి తానా ప్రెసిడెంట్ డాక్టర్ నరేన్ కొడాలి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రవి పొట్లూరి, బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు, మిడ్ అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటి, ఫుడ్ డ్రైవ్ కో-ఆర్డినేటర్ గోపి వాగ్వాల, యూత్ ఫుడ్ డ్రైవ్ ఛైర్లు వ్యోమ్ క్రోధపల్లి, సోహన్ సింగు, యువ నాయకులు ఎంతో ఉత్సాహంగా శ్రమిస్తున్నారు.





## ప్రముఖ దాత ప్రసాద్‌రెడ్డి-శోభారెడ్డి దంపతులకు

# 'శంకర రత్న' పురస్కారం

**ప్రదానం చేసిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**చెన్నై:** శంకర నేత్రాలయ సంస్థ వారి ప్రతిష్టాత్మక 'శంకర రత్న పురస్కారం-2025'కి ప్రముఖ దాత కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి ఎంపికయ్యారు. చెన్నైలోని శంకర నేత్రాలయ ప్రధాన ప్రాంగణంలో ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రసాద్‌రెడ్డి-శోభారెడ్డి దంపతులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి శంకర నేత్రాలయ చైర్మన్ డాక్టర్ సురేంద్రన్, శంకర నేత్రాలయ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ గిరీష్‌రావు, శంకర నేత్రాలయ అమెరికా అధ్యక్షుడు బాలరెడ్డి ఇందుర్తి, అమెరికా నుంచి శ్యామ్ అప్పాలి, ఈవీపీ, డల్లాస్ ట్రస్టీ బుచ్చిరెడ్డి గోలి, మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, 'శంకరరత్న' అవార్డు గ్రహీతలైన ఎస్‌పీ ముత్తురామన్, ప్రముఖ తమిళ రచయిత వీవీ రంగనాథన్, చెన్నై నగర ప్రముఖులు, శంకర నేత్రాలయ చెన్నై సిబ్బంది, పాత్రికేయులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తమిళనాడుతో, శంకర నేత్రాలయతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రసాద్‌రెడ్డి-శోభారెడ్డి దంపతుల సేవా నిరతిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకుని నేత్ర వైద్య సేవలకు మరింత సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రసాద్‌రెడ్డి దంపతులు తమ లాభాల్లో ప్రతిఏటా రెండు మిలియన్ డాలర్లను వివిధ సేవా సంస్థలకు విరాళంగా ఇస్తుంటారని శంకర నేత్రాలయ అమెరికా విభాగం అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఇందుర్తి తెలిపారు. ఇప్పటికే తొమ్మిది ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించిన ప్రసాద్‌రెడ్డి కుటుంబం వచ్చే ఏడాదికి గాను మరిన్ని క్యాంపులను షెడ్యూల్ చేసిందని చెప్పారు. వారి ఆర్థిక సాయంతో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'చెన్నై మేసు' (MESU) బస్సు యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వారి సేవలను అభినందిస్తూ న్యూజెర్సీ రాష్ట్ర సెనెట్ ఇటీవల ఒక ప్రొక్లెమేషన్ కూడా జారీ చేసిందని తెలిపారు. పురస్కార స్వీకారం అనంతరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... శంకర నేత్రాలయ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, వందలాది మంది దాతలు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తూ పేదలకు కంటిచూపు ప్రసాదించడం తనకు ఎంతో స్ఫూర్తి ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా శంకర నేత్రాలయకు అదనంగా మరో లక్ష డాలర్ల విరాళాన్ని అందజేశారు. దీంతో ఇప్పటివరకు శంకర నేత్రాలయకు ప్రసాద్‌రెడ్డి దంపతులు మొత్తం 6,25,000 డాలర్ల విరాళం ఇచ్చి అమెరికాలోనే అత్యధిక ధన సహాయం చేసిన దాతలుగా నిలిచారు.

అవార్డు ప్రదానోత్సవం అనంతరం బాల్‌రెడ్డి ఇందుర్తి, డాక్టర్ గిరీష్‌రావు, స్వామినాథన్ చంద్రశేఖర్ మైసూరులోని దత్త పీఠాన్ని సందర్శించి అవధూత శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. శంకర నేత్రాలయ అందిస్తున్న ఉచిత కంటి వైద్య సేవలను స్వామీజీకి వివరించారు. వారు చేపడుతున్న మంచి కార్యక్రమాలకు తమ పూర్తి ఆశీస్సులు, సహకారం ఉంటాయని స్వామీజీ అభయమిచ్చారు.



అమెరికాలో టాంపా చాప్టర్ ఆధ్వర్యంలో...



సౌదీ అరేబియాలోని దమ్మాంలో 'సాటా' ఆధ్వర్యంలో...

# వైభవంగా దసరా, బతుకమ్మ సంబరాలు

**దమ్మాం (సౌదీ అరేబియా):** గల్ఫ్ దేశాల్లో దసరా అనగానే ముందుగా గుర్తుకొచ్చేది దమ్మాంలోని తెలుగు ప్రవాసీ సంఘం 'సాటా' (SATA-Eastern Region) నిర్వహించే సంబరాలు. ఈ ఏడాది కూడా 'సాటా' ఆధ్వర్యంలో దమ్మాం ప్రాంతంలో దసరా, బతుకమ్మ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించగా తెలుగు ప్రవాసులు కుటుంబ సమేతంగా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తమ ఇళ్లలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వేడుకల అనంతరం జగన్మాత దుర్గాదేవి నిమజ్జనోత్సవం వేద మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా జరిగింది. ఉత్సవాలు జరిగిన భారీ ప్రాంగణం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన ప్రాంగణాన్ని తలపించింది. తెలంగాణ మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి "రామ రామ రామ ఉయ్యాలో" అంటూ జానపద పాటలు పాడుతూ తెలంగాణ పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించారు. దుర్గామాత అమ్మవారి అలంకరణలో లీలకుమారి, బతుకమ్మల నమూనాల రూపకల్పనలో విజయలక్ష్మి (పెద్దపల్లి), కవిత (కరీంనగర్) కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వృత్తిరీత్యా కెమికల్ ఇంజినీర్ అయిన నిజామాబాద్‌కు చెందిన కొక్కుల విశాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'కాకతీయ తోరణం' నమూనా ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ నృత్య ప్రదర్శనలకు సౌజన్య, దిలీప్ మార్గదర్శకత్వం వహించారు. రియాద్ నగరం నుంచి సాటా ప్రతినిధులు నూరుద్దీన్, సురేష్, 'టాస్కా' వ్యవస్థాపకుడు తిరుపతి స్వామి, 'సాట్స్' నాయకులు ఉమామహేశ్వరరావు, వరప్రసాద్‌లతో పాటు పలువురు ప్రముఖులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సాటా (ఈఆర్) అధ్యక్షుడు పల్లెం తేజ, ప్రతినిధులు శ్యామ్ మోహన్, శిల్పా రవి కీలక పాత్ర పోషించగా శ్రవణ్‌కుమార్, విశాల్, సతీష్, ఓంప్రకాష్ కార్యక్రమాలను సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఒక వ్యవసాయ క్షేత్రంలో తోటమాలిగా పనిచేస్తున్న ప్రవాసాంధ్రుడి కుమార్తె వివాహానికి సభ్యులు రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించడం ఆదర్శంగా నిలిచింది.

**టాంపా (అమెరికా):** తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (TTA) టాంపా చాప్టర్ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. తెలుగువారంతా ఒకేచోట చేరి సంప్రదాయ దుస్తులు ధరించి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. టాంపాలోని అయ్యప్ప ఆలయంలో జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకే శైలిలో లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడి ఆడారు. తెలంగాణ సంస్కృతి. సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన సంబరాలు ఆకట్టుకున్నాయి. దేవీ శరన్నవరాత్రులు, బతుకమ్మ సంబరాలతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వాహకులు ఎంతో పద్ధతిగా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవంతంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి స్థానిక ఎన్‌ఆర్ఐల నుంచి విశేష స్పందన లభించింది. 900 మందికి పైగా ఎన్‌ఆర్ఐలు కుటుంబసమేతంగా హాజరై సందడి చేశారు. విచ్చేసిన భక్తులందరికీ నిర్వాహకులు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. టీటీఏ టాంపా చాప్టర్ వాలంటీర్లు, శ్రేయోభిలాషులు, బృందం సభ్యులు, పాఠశాల విద్యార్థుల సహకారంతో ఈ ఈవెంట్ ఘనంగా ముగిసింది. ఈ వేడుకల ద్వారా కొత్త పరిచయాలు ఏర్పడి, మధురానుభూతులు మిగిలాయని స్థానిక తెలుగు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## 'టాకో' ఆధ్వర్యంలో

# పాటల పోటీలు

## నవంబరు 15న గ్రాండ్ ఫైనల్స్



**ఓహియో:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెంట్రల్ ఓహియో (టాకో) ఆధ్వర్యంలో పాటల పోటీలను వైభవంగా నిర్వహించారు. ప్రతిభ, అభిరుచి కలిగిన గాయకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. ఎంపిక చేసుకున్న పాటలను శ్రావ్యంగా ఆలపించారు. నవంబరు 15న గ్రాండ్ ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని నిర్వాహకులు చెప్పారు. పోటీలకు సహకరించిన న్యాయనిర్ణేతలు, వాలంటీర్లు, గాయని, గాయకులను ప్రోత్సహించిన గురువులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



# 'మన్ కీ బాత్' ఒక పవిత్ర యాత్ర



## 12 ఏళ్ల ప్రయాణంపై ప్రధాని హర్షం

పన్నెండేళ్ల క్రితం విజయదశమి నాడు ప్రారంభమైన 'మన్ కీ బాత్' ప్రజల సహకారంతో అప్రతిహతంగా కొనసాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రేడియో వేదికగా నిర్వహించిన 139వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో ఆయన ప్రసంగించారు. 'ఈ పన్నెండేళ్ల ప్రయాణంలో దేశ ప్రజలే మార్గదర్శకులుగా, భాగస్వాములుగా మారారు. ప్రజలు చూపిన కఠిన శ్రమ, ధైర్యం, అంకితభావం, సేవా దృక్పథాన్ని కొనియాడేందుకు ఇదొక అద్భుతమైన అవకాశం. ఇతరులకు తీర్థయాత్రలు ఎలానో.. నాకు 'మన్ కీ బాత్' ప్రయాణం కూడా అలాగే ఉంటుంది" అని ప్రధాని భావోద్వేగంగా వెల్లడించారు. పంజాబ్‌లో చేపట్టిన 'ఖేతీ విరాసత్ మిషన్' ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని ప్రధాని కొనియాడారు. సేంద్రియ (ఆర్గానిక్), సంప్రదాయ వ్యవసాయానికి పునరుజ్జీవం కల్పించేందుకు ఈ మిషన్ విశేషంగా కృషి చేస్తోందని, ముఖ్యంగా పంజాబ్ మాల్వా ప్రాంతంలో పత్తి సాగును ఈ బృందం ఎంతో ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ ప్రాంత ప్రజలు, స్థానిక యంత్రాంగం కలిసి 'హెవల్ నది'కి మళ్లీ ఊపిరిలూదారని మోదీ ప్రశంసించారు. కొన్నేళ్ల క్రితం వరకు తీవ్రంగా నీటి మట్టం తగ్గిపోయిన ఈ నదిని రక్షించుకునేందుకు వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భారీగా మొక్కలు నాటడం వంటి చర్యలు చేపట్టారని, దాంతో నేడు ఆ నది తిరిగి కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

# 6 నెలల్లో 23 మందికి మరణశిక్ష

### జడ్జి రవికుమార్ దివాకర్ బదిలీ



ఇటీవల దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తిగా పని చేస్తున్న రవి కుమార్ దివాకర్ బదిలీ అయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య కేవలం ఆరు నెలల్లో 11 కేసుల్లో 23 మందికి న్యాయమూర్తి రవికుమార్ మరణశిక్ష విధించి అందరి దృష్టినీ ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఇంతకు ముందు బరేలీలో కూడా అనేక మరణశిక్షలు విధించి మొత్తం 35 మరణశిక్షల రికార్డు సృష్టించారు. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రవికుమార్‌ను ఇప్పుడు ముజఫర్ నగర్ ఫ్యామిలీ కోర్టుకు అదనపు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు శివ కుమారి బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఈ ఏడాది ఆగస్టులో అప్పటి జిల్లా సెషన్స్ జడ్జి.. అడ్మినిస్ట్రేటివ్ ఉత్తర్వుల ద్వారా జడ్జి దివాకర్ కోర్టులో విచారణలో ఉన్న సుమారు 97 హత్య, తీవ్రమైన నేరాల కేసుల ఫైళ్లను వేరే కోర్టులకు తరలించారు. దీనిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక తీర్పులో ఆయన ఘాటుగా మాట్లాడుతూ.. 'న్యాయమూర్తి పని న్యాయం చేయడమే. కానీ తనకే అన్యాయం జరిగితే ఆయన ఎవరి దగ్గరికి వెళ్లాలి?' అంటూ వ్యాఖ్యానించారు. అంతే కాదు... పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఓ మాఫియా నుంచి తనకు బదిలీ బెదిరింపులు వచ్చాయని చెప్పారు. అయినా తాను న్యాయ సూత్రాలకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 'పిరికి న్యాయమూర్తిగా పిలిపించుకోవడం కంటే చావే మేలు. నేను సీటులో ఉన్నంత కాలం న్యాయ సూత్రాలకే ప్రాధాన్యం ఇస్తాను' అన్నారు. కాగా రవికుమార్ దివాకర్ 2009లో ఉత్తర్ ప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీసులో చేరారు. వారణాసి, బరేలీ తదితర జిల్లాల్లో పని చేశారు. 2022లో వారణాసిలో జ్ఞానవాపి మసీదు సముదాయం వీడియోగ్రాఫిక్ సర్వే ఆదేశించినప్పుడు మొదటిసారి దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించారు. 2025 నవంబర్లో ముజఫర్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

# గంగా నదిలో గగనతల విన్యాసాలు

### ఆసక్తిగా తిలకించిన ప్రధాని మోదీ



వారణాసి: భారత వైమానిక దళం 94వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న పవిత్ర నమో ఘాట్ వద్ద ఆదివారం 'వింగ్స్ ఓవర్ గంగా' పేరుతో నిర్వహించిన వైమానిక ప్రదర్శనను ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై తిలకించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు. వైమానిక దళానికి చెందిన సుప్రసిద్ధ 'సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్', 'సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే టీమ్' తమ అద్భుతమైన గగనతల విన్యాసాలతో అలరించాయి. స్వదేశీ ఫైటర్ జెట్ తేజస్, లైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్, ఫ్రంట్‌లైన్ ఫైటర్ జెట్లు సుఖోయ్, రఫేల్, రవాణా విమానాలు IL-76, IL-78, C-295, AN-32 ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌తో పాటు భారత నావికాదళం, భారత ఆర్మీకి చెందిన విమానాలు, హెలికాప్టర్లు కూడా పాల్గొని సాయుధ దళాల సంయుక్త సామర్థ్యాన్ని చాటిచెప్పాయి.

ఏరియల్ డిస్‌ప్లే కార్యక్రమానికి హాజరుకావడానికి ముందు ప్రధాని మోదీ వారణాసిలో 'అరవింద్ లిమిటెడ్' నూతన దుస్తుల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇది పూర్తిగా మహిళల నేతృత్వంలో సాగే పారిశ్రామిక ప్రాజెక్ట్ కావడంతో ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి, మహిళా సాధికారతకు ఎంతో దోహదపడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇవాళ వారణాసి పర్యటనకు విచ్చేసిన ప్రధానికి స్థానిక మహిళలు జాతీయ జెండాలు, బీజేపీ జెండాలు చేతబూని సంప్రదాయ డప్పులు వాయిస్తూ రోడ్డు పొడవునా ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోదీ మహిళా సాధికారతకు చేస్తున్న కృషికి గాను వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

# కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తే కఠిన చర్యలు

### ఐటీ కంపెనీలకు సీఎం శివకుమార్ హెచ్చరిక

కర్ణాటక కేంద్రంగా పనిచేసే ప్రైవేటు సంస్థలు... ముఖ్యంగా ఐటీ కంపెనీల యాజమాన్యాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియామక ప్రక్రియలో కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నట్లు తేలితే ఆయా సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికుల హక్కులు, గౌరవం, ఉద్యోగ అవకాశాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదన్నారు. బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయని, వీటిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని డీకే 'ఎక్స్'లో పోస్టు చేశారు. కన్నడ ప్రజల హక్కులు, గౌరవానికి ఇబ్బంది కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అనుమతించబోదని చెప్పారు. కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యాలను చూసి రాష్ట్రం గర్విస్తోందన్నారు. ఏదైనా ప్రైవేటు సంస్థ వారిని ఉద్దేశపూర్వకంగా పక్కనపెడితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కన్నడిగులకు ఉద్యోగాల అంశంపై సోషల్ మీడియాలో ఇటీవల వీడియోలు వైరల్ అయ్యాయి. తాజాగా రెజ్యూమెలో భాష స్థానంలో కన్నడ అని ప్రస్తావించినందుకు తన దరఖాస్తును తిరస్కరించారని చెబుతూ ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా ట్యాగ్ చేసింది.



# పురాతన అందాల సమాహారం

### గంగవరం బీచ్ అందాలకు ఆనంద్ మహీంద్రా ఫిదా

విశాఖపట్నం సమీపంలోని గంగవరం బీచ్ సుందర దృశ్యాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ తీవ్ర ప్రశంసలు కురిపించారు. దేశంలో ఎక్కువగా మాట్లాడుకునే తీర ప్రాంత పర్యాటక ప్రదేశాల జాబితాలో ఇది ఎందుకు లేదోనని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణ బీచ్‌లలో కనిపించే కొబ్బరి చెట్లు, పచ్చదనమే కాకుండా.. ఎత్తయిన రాతి కొండలతో కఠినమైన, పురాతన సహజ సౌందర్యం ఇక్కడ దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో సేదతీరడానికి, ఆత్మపరిశీలన చేసుకోవడానికి ఇది ఎంతో అనువైన ప్రదేశమని అభివర్ణించారు. ప్రస్తుతం ప్రపంచంలోని టెక్ దిగ్గజాలు, భారీ డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల నిర్మాణానికి విశాఖవైపు వస్తూ ప్రధాన టెక్ హబ్‌గా వేగంగా మారుతోందని గుర్తు చేశారు. అదే సమయంలో అత్యంత అద్భుతమైన తీం ప్రాంత పర్యాటక ప్రదేశంగానూ వెలుగుగొందే సత్తా విశాఖకు ఉందని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన రాసుకొచ్చారు. ఆనంద్ మహీంద్రా చేసిన వ్యాఖ్యలతో నెటిజన్లు సైతం ఏకీభవిస్తున్నారు.

# డెలివరీ బాయ్ జీవితంలో వెలుగులు

### అనంత అంబానీ దాతృత్వం..
### సైకిల్ ఏజెంట్‌కు ఈ-స్కూటర్ కానుక



ముంబయి: రోజువారీ జీవనోపాధి కోసం ముంబై వీధుల్లో సైకిల్‌పై డెలివరీలు చేస్తున్న సుజీత్ అనే గిగ్ వర్కర్ కష్టాలను చూసి 'అనంత్ సేవా ఫౌండేషన్' స్పందించింది. చాలీచాలని వేతనంతో వాహనం కొనుగోలు చేయలేకపోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేసిన సందర్భం సామాజిక దృశ్యంగా మారింది. విధులు ముగించుకుని తిరిగి వచ్చిన సుజీత్ కళ్లకు గంతలు కట్టి... అనంత్ అంబానీ తరఫున సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను బహుమతిగా అందజేశారు. ఈ అపారమైన కానుకను చూసి సుజీత్ తీవ్ర భావోద్వేగానికిలోనై కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రముఖ ఇన్‌ఫ్లుయెన్సర్ హుస్సేన్ మన్సూరి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఈ ఘటన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. శ్రామికుల పట్ల ప్రదర్శించిన ఈ దాతృత్వ భావాన్ని నెటిజన్లు విశేషంగా ప్రశంసిస్తున్నారు. 'అనంత్ సేవా ఫౌండేషన్' ఆధ్వర్యంలో సమాజంలోని ఎందరో శ్రామికులకు, అవసరార్థులకు ఈ తరహా సహాయ కార్యక్రమాలను నిరంతరం అందిస్తున్నట్టు జాతీయ మీడియా కథనాలు స్పష్టం చేశాయి.

# ఫ్రాన్స్‌లో చెలరేగిన హింస..
# వెయ్యి మంది అరెస్టు

### టియర్ గ్యాస్, వాటర్ కెనాన్ల ప్రయోగం



ఫ్రాన్స్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. మొదట ఫ్రాన్స్ వరకే పరిమితమైన ఆందోళనలు ఇప్పుడు అనేక పట్టణాలకు విస్తరించాయి. ప్రజలు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలపడంతో ఆందోళన ఉధృతంగా కొనసాగుతోంది. జీవన వ్యయం పెరగడం, నిత్యవసరాల సరుకులు అందుబాటులో లేకపోవడం, నిరుద్యోగం వంటి సమస్యల్ని నిరసిస్తూ ఫ్రాన్స్‌లో ప్రజలు ఆందోళనబాట పట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు వెయ్యి మందిని అరెస్టు చేశారు.

ఈ విషయాన్ని ఫ్రాన్స్ రక్షణ శాఖ మంత్రి లారెంట్ నునెజ్ వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 4.10 లక్షల మంది ఆందోళనల్లో పాల్గొన్నారు. అయితే నిర్వాహకులు మాత్రం 8 లక్షల మంది ఆందోళనల్లో పాల్గొన్నట్టు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ ఆందోళనల్లో కొందరు నిరసనకారులు షాపులను దహనం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు. షాపుల్ని లూటీ చేస్తున్నారు. దీంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. కోర్స్ డి విన్సెన్నెస్ ప్రాంతంలో ఆందోళనకారుల్ని చెదరగొట్టారు. ఈ ప్రాంతంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఆందోళనకారులను అదుపు చేసేందుకు హెలికాప్టర్లను కూడా వాడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆందోళనల్ని అదుపు చేయడానికి వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్, గ్రెనేడ్లు వంటివి వాడుతున్నట్లు వివరించారు. శాంతి భద్రతల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. లియోన్, లిల్లె, మార్సెల్లి సహా ఇతర పట్టణాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

## అమెరికా సాయం ఉక్రెయిన్ ధనికులకే చేరుతోంది: మస్క్



రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న వందల బిలియన్ డాలర్ల సాయం వల్ల అక్కడి ధనికులు మరింత సంపద కూడబెట్టుకుంటున్నారని టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓవైపు సంపన్నులు బాగుపడుతుంటే మరోవైపు సామాన్య ప్రజల పిల్లలు మాత్రం యుద్ధరంగంలో పోరాడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. మస్క్ వ్యాఖ్యలకు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంపూర్ణ మద్దతు తెలుపుతూ... ఆయన న్యాయంగా వ్యవహరించే వ్యక్తి అని ప్రశంసించారు. ఉక్రెయిన్ సైన్యం, డ్రోన్ల నిర్వహణకు ఎంతో కీలకమైన 'స్టార్‌లింక్' ఇంటర్నెట్ సేవలపై విధించిన వేగ పరిమితులను ఎట్టకేలకు తొలగించినట్టు ఉక్రెయిన్ రక్షణ శాఖ అధికారికంగా వెల్లడించింది. దీనివల్ల గంటకు 400 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే పరికరాలు కూడా ఇకపై అత్యంత వేగంగా పనిచేయగలవని ప్రకటించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా రాయబారులు ప్రయత్నాలు వేగవంతం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. వచ్చే నెలలో అమెరికా, ఉక్రెయిన్‌లతో త్రైపాక్షిక భేటీకి రష్యా సూత్రప్రాయంగా అంగీకరించింది. దక్షిణ ఖేర్సన్ ప్రాంతంలోని రష్యా ఆక్రమిత పట్టణమైన 'ఒలేష్కీ' చుట్టూ అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వంతో కుదిరిన స్థానిక కాల్పుల విరమణ ఒప్పందానికి రష్యా, ఉక్రెయిన్ అంగీకారం తెలిపాయి.

## సౌదీ అరేబియాపై హూతీల దాడి

### ఆ వీడియోలు షేర్ చేయొద్దంటూ భారతీయులకు సూచన

సౌదీ అరేబియాపై హూతీ ఉగ్రవాదులు వరుసగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ రకాల డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులకు దిగుతోంది. అయితే వీటికి సంబంధించిన వీడియోలను షేర్ చేయొద్దని సౌదీ అరేబియా ప్రభుత్వం సూచించింది. సౌదీలో ఉంటున్న భారతీయులు ఈ ఆదేశాన్ని పాటించాలని సూచించింది. ఇతర దేశాల ప్రజలకు కూడా ఇదే సూచన చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. దీనిని సౌదీలోని భారత రాయబార కార్యాలయం రీ ట్వీట్ చేసింది. సౌదీలో ఉంటున్న భారతీయులు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించింది. ఈ సూచనల ప్రకారం... సౌదీ అరేబియాలోని వివిధ ఎయిర్‌పోర్టులు, చమురు క్షేత్రాలపై హూతీలు దాడులు చేస్తున్నారు. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడికి పాల్పడుతున్నారు. వీటిలో కొన్నింటిని సౌదీ రక్షణ విభాగం అడ్డుకుంటోంది. హూతీల దాడులు.. పలు భవనాలు ధ్వంసం కావడం.. కొన్నింటిని సౌదీ అడ్డుకుని గాల్లోనే పేల్చేయడం వంటివి జరుగుతున్నాయి. వీటన్నింటిని అక్కడ ఉన్న స్థానికులు తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీస్తున్నారు. వాటిని సోషల్ మీడియా, వాట్సాప్‌ల్లో షేర్ చేస్తున్నారు. ఈ అంశంపైనే సౌదీ స్పందించింది. భారతీయులు సహా తమ దేశంలో ఉంటున్న వారెవరూ వాటిని వీడియో తీయొద్దని, షేర్ చేయవద్దని సూచించింది. ఈ నిబంధనను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. హూతీల దాడుల నేపథ్యంలో రియాద్, దమ్మామ్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి విమానయాన సేవలను నిలిపివేస్తున్నట్టు సౌదీ ప్రకటించింది. నవంబరు 7వ తేదీ వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని ప్రకటించింది.



## హిట్లర్ పర్వత విడిది అగ్నికి ఆహుతి

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్, నాజీ ఉన్నతాధికారులు, వారి అతిథుల కోసం 1938లో నిర్మించిన ప్రసిద్ధ పర్వత విడిది 'ఈగిల్స్ నెస్ట్' తాజాగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదం ఈ నెల 22న జరిగినట్టు జర్మనీ అధికారులు వెల్లడించారు. నాజీ పాలనా కాలంలో సైనిక ఉన్నతాధికారుల బస కేంద్రంగా ఉన్న ఈ భవనాన్ని స్థానికులు 'కెహ్ల్‌స్టైయిన్‌హౌస్' అని పిలిచేవారు. జర్మనీలోని బవేరియా ప్రాంతంలో పర్వతంపై ఏకంగా 1,834 మీటర్ల ఎత్తులో ఈ విడిది గృహాన్ని నిర్మించారు.రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓటమిపాలైన ప్పటికీ ఈ చారిత్రక కట్టడాన్ని కూల్చివేయకుండా అలాగే కాపాడారు. ఇటీవలి కాలం వరకు స్థానిక ప్రభుత్వం ఈ భవనాన్ని పలు దాతృత్వ, సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం వినియోగిస్తోంది. ఈగిల్స్ నెస్ట్‌కు కావాలనే నిప్పు పెట్టినట్టు అనుమానిస్తూ ఒక వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మంటలు చెలరేగి భారీగా పొగలు కక్కుతున్న కట్టడం చిత్రాలను అధికారులు అధికారికంగా విడుదల చేశారు.

## మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లు అమెరికాలో అరెస్టు

### ఎఫ్‌బీఐ వలలో హిమాన్షు భావు, నీరజ్ ఫరీద్ పురియా





కొన్నేళ్లుగా పరారీలో ఉంటూ భారత దర్యాప్తు సంస్థల కళ్లుగప్పి విదేశాల్లో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్లు హిమాన్షు భావు, నీరజ్ ఫరీద్‌పురియాలను అమెరికాలోని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు అరెస్టు చేశారు. హర్యానాకు చెందిన హిమాన్షు భావుపై ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, ఆయుధాల అక్రమ రవాణా వంటి 18 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 17 ఏళ్ల వయసు నుంచే నేరాలకు పాల్పడిన ఇతడు 2020లో బాలల సంరక్షణ కేంద్రం నుంచి తప్పించుకుని ఇంటిపేరు మార్చి చూపి విదేశాలకు పారిపోయాడు. విదేశాల్లో ఉంటూనే ఢిల్లీ-ఎన్‌సీఆర్, హర్యానా, పంజాబ్‌ల్లో వందల మంది అనుచరులతో పెద్ద ముఠాను నడిపించినట్టు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. 2022లో హర్యానాలో ఒకేరోజు మూడు హత్యలు జరిగిన ఘటనతో ఇతడి పేరు వెలుగులోకి వచ్చింది. 2023లో ఇంటర్‌పోల్ అధికారులు ఇతనిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో పాటు ఢిల్లీ, హర్యానా పోలీసుల 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో భావు పేరు చేరింది. హర్యానాకే చెందిన నీరజ్ ఫరీద్ పురియాపై కూడా 25కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. హిమాన్షు భావు ముఠాతో కలిసి ఇతడు నేర కార్యకలాపాలు సాగిస్తున్నట్టు దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. అరెస్టయిన ఇద్దరు మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లను త్వరలోనే భారత్‌కు రప్పించేందుకు సీబీఐ అధికారులతో కలిసి హర్యానా పోలీసులు చట్టపరమైన చర్యలను వేగవంతం చేస్తున్నారు.

## చర్చలు జరిపేందుకు ఇరాన్‌లో నాయకులేరీ: ట్రంప్



ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపడతామని గత కొన్నాళ్లుగా చెప్పుకొస్తున్న డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా దాడుల్లో ఆ దేశానికి చెందిన అగ్రనాయకత్వమంతా తుడిచిపెట్టుకుపోయిందని, కనీసం చర్చలు జరపడానికి కూడా ఎవరూ దొరకట్లేదని వ్యాఖ్యానించారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ట్రంప్ ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. 'వారి దగ్గర యుద్ధ విమానాల్లేవ్.. యుద్ధ నౌకల్లేవ్.. నాయకులూ లేరు. అసలు వారి దగ్గర ఏమీ లేదు. అగ్రశ్రేణి నాయకులు పోయారు. ద్వితీయ శ్రేణి నాయకులూ పోయారు. ఇక కనీసం చర్చలు జరపాలన్నా ఎవరూ దొరకడం లేదు. చర్చలు జరపడానికి ఎవరో ఒకరు కావాలి కదా. అందుకే దాడులు ఆపేశా. శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే మాత్రం ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని ట్రంప్ హెచ్చరించారు.

### యుద్ధం జరిగినా పాత ఫలితమే: ఇరాన్

అమెరికా దుందుడుకు చర్యలను నిశితంగా గమనిస్తున్నామని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. మరోసారి యుద్ధం మొదలైనా తమ దేశ వైఖరి మారబోదని ఆయన స్పష్టం చేశారు. 'ఇటీవల కొత్త యుద్ధం గురించి చర్చ జరుగుతోంది. యుద్ధం వచ్చినా.. రాకపోయినా.. మా విధానాలు మారవు. ఇప్పటికే రెండుసార్లు యుద్ధం చేశారు. ఫలితం ఎలా ఉందో చూశారు. మరోసారి ప్రయత్నించాలనుకుంటే.. గతంలో వచ్చిన ఫలితాలే పునరావృతమవుతాయి. ఆ విషయం వాళ్లకు (అమెరికా)కు కూడా తెలుసు.' అని ఓ అంతర్జాతీయ మీడియాతో అరాగ్చీ వ్యాఖ్యానించారు. హర్మూజ్‌లో గత కొన్నాళ్లుగా చోటుచేసుకుంటున్న ఘర్షణలు రవాణా స్వరూపాన్నే మార్చివేశాయని ఆయన అన్నారు. హర్మూజ్ నౌకా మార్గం ఇకపై మునుపటిలా ఉండబోదని, దాని నిర్వహణ తీరు కూడా మారుతుందన్నారు.

# జింబాబ్వేపై భారత్ ఘన విజయం

### వన్డే సిరీస్ కైవసం చేసుకున్న మహిళల జట్టు - శతకాలతో అదరగొట్టిన హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ

జింబాబ్వే మహిళలతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు ఘన విజయం సాధించింది. 121 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ శతకాలతో అదరగొట్టగా.. బౌలింగ్‌లో వైష్ణవి శర్మ నాలుగు వికెట్లతో సత్తాచాటింది. సెంచరీతో సత్తా చాటిన దీప్తి బంతితోనూ మెరిసి మూడు వికెట్లు పడగొట్టింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ (121 బంతుల్లో 126), దీప్తి శర్మ (86 బంతుల్లో 126) శతకాలతో రాణించారు. ఇద్దరూ సమయోచితంగా రాణించడంతో టీమిండియా భారీ స్కోరు సాధించింది. ప్రతీకా రావల్ (67) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడింది. 329 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే మహిళల జట్టు ఏ దశలోనూ గెలిచేలా కనిపించలేదు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి పోటీ ఇవ్వలేకపోయింది. భారత యువ బౌలర్ వైష్ణవి శర్మ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టింది. పది ఓవర్లలో 39 పరుగులు ఇచ్చి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను దెబ్బతీసింది. సెంచరీ చేసిన దీప్తి శర్మ బంతితో కూడా రాణించింది. మూడు వికెట్లు తీసి జింబాబ్వే వెన్ను విరిచింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో జింబాబ్వే 48.5 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ 121 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి వన్డేలోనూ భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను గెలుచుకుంది.




## అభిషేక్ శర్మ అరుదైన ఘనత భారత తొలి ఓపెనర్‌గా!




టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000 పరుగుల మైలురాయిని అందుకున్న తొలి భారత ఓపెనర్‌గా చరిత్ర సృష్టించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో 21 బంతుల్లో 27 పరుగులు చేసిన అభిషేక్.. ఈ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో అభిషేక్ మూడో స్థానంలో నిలిచాడు. సూర్యకుమార్ యాదవ్ (2022), ఇషాన్ కిషన్ (2026) ఈ ఘనత సాధించారు. ఇప్పుడు అభిషేక్ కూడా వారి సరసన చేరాడు. అయితే భారత ఓపెనర్లలో ఈ మైలురాయిని అందుకున్న తొలి ఆటగాడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ ఏడాది ఇప్పటివరకు 36 మ్యాచ్‌ల్లో అభిషేక్ 1012 పరుగులు సాధించాడు. భారత క్రికెట్‌లో టెస్టుల్లో ఒకే ఏడాది 1000 పరుగులు సాధించిన తొలి ఓపెనర్‌గా సునీల్ గావస్కర్ రికార్డు నెలకొల్పగా.. వన్డేల్లో 1994లో సచిన్ టెండూల్కర్ ఈ ఘనత అందుకున్నాడు. ఇప్పుడు టీ20ల్లో అభిషేక్ తనదైన ముద్ర వేశాడు.

# రోహిత్, కోహ్లీ, బుమ్రాలకు నో ప్లేస్




### రహానె ఆల్‌టైమ్ భారత టెస్టు జట్టు

భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానె తన ఆల్‌టైమ్ భారత టెస్టు జట్టును ప్రకటించి క్రికెట్ వర్గాల్లో చర్చకు తెరలేపాడు. ఈ జట్టులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యార్కర్ల కింగ్ జస్‌ప్రీత్ బుమ్రాలకు చోటు కల్పించలేదు. అంతేకాదు.. తనకు తానే తుది జట్టులో స్థానం ఇచ్చుకున్నాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను నాలుగో స్థానంలో ఎంపిక చేసిన రహానె.. ఎంఎస్ ధోనికి జట్టు పగ్గాలు అప్పగించాడు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న అతడు.. అంతర్జాతీయ లేదా దేశవాళీ క్రికెట్‌లో కలిసి ఆడిన ఆటగాళ్లలో అత్యుత్తమ భారత టెస్టు జట్టును ఎంపిక చేయాలని కోరగా తన జట్టును వెల్లడించాడు.

రహానె తన ఆల్‌టైమ్ జట్టులో ఓపెనర్లుగా మురళీవిజయ్, శిఖర్ ధావన్‌లను ఎంచుకున్నాడు. మూడో స్థానంలో టీమిండియా మాజీ దిగ్గజం రాహుల్ ద్రవిడ్‌కు అవకాశం కల్పించాడు. నాలుగో స్థానంలో విరాట్ కోహ్లీకి బదులుగా సచిన్ టెండూల్కర్‌ను ఎంపిక చేశాడు. ఐదో స్థానాన్ని తనకే కేటాయించుకున్నాడు. ఆరో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ ఎంఎస్ ధోనీని ఎంపిక చేయడంతో పాటు జట్టు కెప్టెన్సీ బాధ్యతలూ అతడికే అప్పగించాడు. గత దశాబ్ద కాలంగా భారత టెస్టు జట్టులో కీలక పాత్ర పోషించిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు రహానె తన జట్టులో చోటివ్వకపోవడం ఆసక్తికరంగా మారింది. బౌలింగ్ విభాగంలో ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ పేసర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన జస్‌ప్రీత్ బుమ్రాకు చోటు దక్కలేదు. అతడి స్థానంలో మహమ్మద్ షమీ, ఇషాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్‌లను ఎంపిక చేశాడు. విదేశీ గడ్డపై భారత టెస్టు జట్టు విజయాల్లో ఈ ముగ్గురు పేసర్లు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. స్పిన్ విభాగంలో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లకు చోటు కల్పించాడు.

**రహానె ఆల్‌టైమ్ భారత టెస్టు జట్టు ఇదే:**

మురళీవిజయ్, శిఖర్ ధావన్, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, అజింక్య రహానె, ఎంఎస్ ధోని (కెప్టెన్, వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీ, ఇషాంత్ శర్మ

# ఆట మధ్యలో తెలుగు మాట




భారత జట్టు ఆడే క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మైదానంలో తెలుగు మాటలు వినిపిస్తే వినడానికి ఆసక్తిగానే ఉంటుంది కదా! శనివారం అదే జరిగింది. కివీస్‌తో రెండో టీ20లో కీలక భాగస్వామ్యంతో జట్టును గెలిపించిన తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ, నితీశ్‌కుమార్ రెడ్డి తెలుగులో సంభాషించుకోవడం కెమెరాల్లో రికార్డయింది. పరుగు తీసే క్రమంలో చిన్న సమన్వయలోపం తలెత్తడంతో ఇద్దరూ కొంచెం గట్టిగా తెలుగులో మాట్లాడుకున్నారు. "నువ్వు కాల్ ఇవ్వలేదు" అని తిలక్ అంటే. "నువ్వు వచ్చేసేయ్ నేను వచ్చేస్తా ఆరాంసే" అని నితీశ్ బదులిచ్చాడు. తర్వాత తిలక్.. "రేయ్ రెండు అని చెప్పురా పోనీ నేను ముందొచ్చి వెయిట్ చేస్తా నీకోసం" అని గట్టిగా అన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతమవుతోంది. విశేషమేంటంటే.. ఇద్దరు తెలుగు కుర్రాళ్లు మ్యాచ్ గెలిపించిన నేపథ్యంలో ఈ మ్యాచ్ గురించి టీవీ విశ్లేషణ చేస్తూ మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ దినేశ్ కార్తీక్, వ్యాఖ్యాత హర్ష భోగ్లే, నటి సయామీ ఖేర్ కూడా తెలుగులో మాట్లాడారు. కార్తీక్ తమిళనాడు వాసి అయినప్పటికీ అతను తెలుగు కుటుంబానికి చెందిన వాడే. హర్ష హైదరాబాద్ లోనే పుట్టి పెరిగాడు. సయామీ తెలుగులో రేయ్, వైల్డ్, హైవే చిత్రాల్లో నటించింది.

**తెలుగు భాష మాధుర్యాన్ని చాటిచెప్పారు: మంత్రి లోకేశ్**

న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్లో భారత జట్టును విజయతీరాలకు చేర్చిన తెలుగు క్రికెటర్లు తిలక్‌వర్మ, నితీశ్‌కుమార్ రెడ్డికి ఏపీ మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. చక్కనైన తెలుగులో మాట్లాడుకుంటూ సమన్వయంతో మ్యాచ్‌ను ముగించారన్నారు. తెలుగోడి సత్తా, తెలుగు భాష మాధుర్యాన్ని న్యూజిలాండ్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పారని లోకేష్ కొనియాడారు. ఈ మేరకు తిలక్ వర్మ, నితీష్‌కుమార్ రెడ్డిలతో పాటు టీవీ విశ్లేషణ చేసిన దినేశ్ కార్తీక్, హర్ష భోగ్లే, సయామీ ఖేర్ తెలుగులో మాట్లాడిన వీడియోను 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

## పీవీ సింధుకు నిరాశ.. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓటమి



భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఫ్రెంచ్ ఓపెన్ 2026లో నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ నెం.1 అన్ సెయంగ్ చేతిలో ఆమె ఓటమి పాలైంది. తొలి గేమ్‌ను గెలిచి టైటిల్‌పై ఆశలు రేకెత్తించిన సింధు.. ఆ తర్వాతి రెండు గేముల్లో తడబాటుకు గురైంది. ప్రత్యర్థి ఆధిపత్యాన్ని అడ్డుకోలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మ్యాచ్ ఆరంభంలో సింధు ఆత్మవిశ్వాసంతో ఆడింది. అన్ సెయంగ్‌ను కోర్టు నలుమూలలా కదిలిస్తూ నెట్ వద్ద చక్కటి షాట్లు, డ్రాప్ షాట్లు, స్మాష్‌లతో పాయింట్లు సాధించింది. తొలి గేమ్‌ను 21-16తో సొంతం చేసుకుంది. దీంతో ప్రపంచ నెం.1ని ఓడించి టైటిల్ గెలుస్తుందనే ఆశలు పెరిగాయి. రెండో గేమ్‌లో అన్ సెయంగ్ తన ఆటతీరును మార్చుకుంది. వేగవంతమైన షాట్లు, కచ్చితమైన ప్లేస్‌మెంట్‌తో సింధుపై ఒత్తిడి పెంచింది. గేమ్ మొత్తం ఆధిపత్యం కొనసాగించి 21-11తో సత్తా చాటింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు కాసేపు ప్రతిఘటించింది. కొన్ని కీలక పాయింట్లు సాధిస్తూ ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చింది. అయితే... అన్ సెయంగ్ వేగంగా, రక్షణాత్మకంగా ఆడుతూ, వరుస దాడులు చేసి సింధుకు ఇబ్బందులు సృష్టించింది. చివరకు 21-12తో మూడో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌తో పాటు టైటిల్‌ను కూడా సొంతం చేసుకుంది. మొత్తం 61 నిమిషాల పాటు ఫైనల్ పోరు సాగింది. ఇప్పటివరకు వీరిద్దరి మధ్య జరిగిన 11 మ్యాచ్‌ల్లోనూ సింధు ఒక్కసారి కూడా గెలవలేకపోయింది.

చైతన్య రథం సినిమా

సోమవారం 26 అక్టోబర్ 2026 X





# 'రామాయణ' అడ్వాన్స్ బుకింగ్స్ అ'ధర'హో

రామాయణం ఆధారంగా సుమారు రూ.4 వేల కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటుండగా తొలి భాగం నవంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌కు అనూహ్య స్పందన వస్తోంది. ఇప్పటికే 137 నగరాలు, పట్టణాల్లో 4,339 షోలకు గాను 1.81 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోయాయని, దీనిద్వారా రూ.10 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఐమ్యాక్స్ థియేటర్లలో ఈ సినిమాను చూడటానికి ప్రేక్షకులు ఆసక్తి చూపుతుం డటంతో అక్కడ టికెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ముంబైలోని కొన్ని ఐమ్యాక్స్‌ల్లో రిక్లైనర్ సీటు ధర రూ.3,170 పలుకుతుండగా, పీవీఆర్ ఐకాన్ ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ఉదయం 7 గంటల షో రిక్లైనర్ సీటు ధర రూ. 1,850గా ఉంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని ఐమ్యాక్స్ త్రీడీ వెర్షన్‌కు ఈ ధర రూ.1,550–2,400 మధ్య ఉంది.

# మెగా ఫ్యాన్స్‌కు అదిరిపోయే అప్డేట్



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ =జ 17. ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు, సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్డేట్ వచ్చేసింది. నవంబరు 1న ఎంతో గ్రాండ్‌గా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు. సోషల్ మీడియాలో ఈ అప్డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.

# జోడీ కుదిరింది!



కథా నాయకుడు సాయిదుర్గా తేజ్ ఇటీవలే ప్రకటించిన కొత్త చిత్రానికి సంబంధించి ఆసక్తికరమైన విషయం వెలువడింది. తేజ కాకుమాను దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించనున్న ఈ సినిమా అటవీ నేపథ్యంలో ముడిపడిన యాక్షన్ డ్రామాగా రూపొందనుంది. ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యమున్నట్లు తెలుస్తోంది. ఇందులో సాయిదుర్గా తేజ్‌కు జోడీగా 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడను ఎంచుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ నెలాఖరు నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా నిర్మాణానంతర పనుల్లో ఉండగా... వచ్చే సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నిధి వేట కాదు.. భయపెట్టడం పక్కా




నాగచైతన్య, మీనాక్షి చౌదరి జంటగా కార్తిక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న 'వృషకర్మ'పై ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమా ట్రెజర్ హంట్ జానర్ కాదని దర్శకుడు స్పష్టం చేశారు. హీరో పాత్ర నిధి వేటగాడిలా కనిపించినా సినిమాలో నిధి ఉండదన్నారు. భయపెట్టడంతో పాటు మంచి ఎమోషన్స్ కూడా ఉంటాయని తెలిపారు. డిసెంబర్‌లో విడుదల కానున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తుండగా, బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు.




# షారుఖ్ ఖాన్ పుట్టినరోజు కానుక

### థియేటర్లలోకి 'డీడీఎల్‌జే' రీ-రిలీజ్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది. షారుఖ్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన కల్ట్ క్లాసిక్ లవ్ స్టోరీ 'దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే' చిత్రాన్ని ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా థియేటర్లలో రీ–రిలీజ్ చేయనున్నారు. షేర్ బాగ్, పీవీఆర్, ఐనాక్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్లలో పరిమిత స్క్రీన్లలో ఈ సినిమాను ప్రదర్శించనున్నారు. మ్యాజికల్ లవ్ స్టోరీని మరోసారి బిగ్ స్క్రీన్‌పై చూసేందుకు అభిమానులు ఎంతగానో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు షారుఖ్ బర్త్‌డే కావడంతో ఆయన నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' టీజర్‌ను కూడా విడుదల చేయనున్నట్టు సమాచారం.

# రజనీకాంత్ 'ధర్మన్'లో నయనతార



సూపర్‌స్టార్ రజనీకాంత్ వరుస సినిమాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల 'జైలర్ 2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన ఇప్పుడు తన తదుపరి చిత్రం 'ధర్మన్' కోసం పని చేస్తున్నారు. కమల్‌హాసన్ నిర్మాణ బాధ్యతలు చేపడుతుండటంతో ఈ ప్రాజెక్టుపై సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ కీలకమైన వార్త వెలుగులోకి వచ్చింది. చాలా కాలంగా వినిపిస్తున్న ప్రచారానికి తెరదించుతూ.. నటి నయనతార 'ధర్మన్' సినిమాలో కథానాయికగా నటించనున్నట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో రజనీకాంత్, నయనతార అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇద్దరూ కలిసి నటించడం ఇదే ఆరోసారి కావడం విశేషం. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని ఏ తరహా కథతో రూపొందిస్తున్నారనే విషయం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. రజనీకాంత్ శైలికి తగిన వినోదం, కథలోని ప్రత్యేకతలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను 2027 సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం.




# సీబీఎఫ్‌సీ 'ఇ-సినీప్రమాణ్' పోర్టల్‌లో డేటా లీక్

### 500కు పైగా చిత్రాల సెన్సార్ పత్రాలు బహిర్గతం

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్‌లో భారీ డేటా లీక్ జరిగింది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ డేటా లీక్‌లో సీబీఎఫ్‌సీ ఫీచర్ ఫిల్మ్ సహా 500కు పైగా చిత్రాల ధ్రువీకరణ రికార్డులు. బహిర్గతమయ్యాయి. వీటిలో సినిమాలను థియేటర్లలో విడుదల చేయడానికి అనుమతి పొందడం కోసం చిత్ర నిర్మాతలు సమర్పించిన స్క్రిప్టులు, కట్ ఆర్డర్లు, ఇతర పత్రాలు కూడా ఉండడం గమనార్హం. సీబీఎఫ్‌సీ తన ధ్రువీకరణ పనిని డిజిటలైజ్ చేయడానికి.. దశాబ్దం క్రితం ఇ–సినీ ప్రమాణ్ అనే ఆన్లైన్ పోర్టల్‌లను ప్రారంభించింది. చిత్ర నిర్మాతలు సినిమా ధ్రువీకరణల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఈ పోర్టల్ ద్వారా పత్రాలను సమర్పిస్తారు. ప్రస్తుతం ఈ ఇ–సినీప్రమాణ్ పోర్టల్ నుంచే కీలక డేటా లీకైంది. ఆన్లైన్ కంటెంట్‌ను భద్రపరిచే లాభాపేక్షలేని డిజిటల్ లైబ్రరీ అయిన ఇంటర్నెట్ ఆర్కైవ్ ద్వారా ఈ రికార్డులు డౌన్లోడ్ చేసుకోవడానికి అందుబాటులో వచ్చాయి. ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆ మెటీరియల్‌ను తొలగించినట్లు ఇంటర్నెట్ ఆర్కైవ్ వెల్లడించింది. సైబర్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. డేటా లీకైపై దర్యాప్తు చేస్తున్నామని.. పోర్టలై పై భద్రతా ఆడిట్ నిర్వహిస్తున్నామని సీబీఎఫ్‌సీ తెలిపింది. అనధికారిక యాక్సెస్ ఆరోపణలకు సంబంధించిన సమాచారాన్ని సమీక్షించామంది. అయితే బహిర్గతమైన పత్రాలను ఇతరులు యాక్సెస్ చేసినట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేసింది. ఏ ఒక్క చిత్ర నిర్మాత ఖాతా కూడా హ్యాక్ అయినట్లు కనిపించట్లేదంది. దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామంది.